ఆదివారం
17-12-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 175
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

కువైట్ అమీర్ కన్నుమూత

కువైట్ సిటీ: కువైట్ అమీర్ షేక్ నవాఫ్ అల్ అహ్మద్ అల్ సబా (86) కన్నుమూశారు. సుమారు నెల రోజులుగా అనారోగ్యంగా ఉన్న ఆయన శనివారం తుదిశ్వాస విడిచినట్లు రాజభవనం వర్గాలు ప్రకటించాయి. అమీర్ షేక్ నవాఫ్ మరణానికి ప్రభుత్వం సంతాపం తెలిపింది. ఆయన మరణ వార్తను బరువెక్కిన హృదయాలతో తెలియజేయాల్సి వస్తోందని కువైట్ మీడియా పేర్కొంది. పాలకుడి మృతి వార్తను ప్రసారం చేసిన అనంతరం అన్ని ప్రసారాలను ప్రభుత్వ ఛానల్ ఆపేసింది. అమీర్ షేక్ నవాజ్ మరణంతో ఆయన బాధ్యతలను యువరాజు మేషల్ అల్ అహ్మద్ చేపడారని కువైట్ కేబినెట్ నిర్ణయించింది.

మాటలే.. చేతల్లేవ్

- ఎన్నికల వేళ తెల్లకార్డుల ఎర
- లబ్ధిదారుల ఎదురుచూపు
- సచివాలయాలకే దరఖాస్తులు పరిమితం
- జగన్ సర్కారుపై ప్రజల ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: ఎన్నికలు సమీపిస్తున్న వేళ...జగన్ ప్రభుత్వం రేషన్ కార్డుల నాటకం ప్రారంభించింది. కొత్త రేషన్ కార్డుల కోసం ఇప్పటికే లక్షలాదిమంది ఎదురుచూస్తున్నారు. సచివాలయాల్లో దరఖాస్తులు కుప్పలుకుప్పలుగా పడిఉన్నాయి. కొత్త కార్డులు ఇస్తామని జగన్ ప్రభుత్వం ఎప్పటి నుంచో ప్రకటిస్తోంది గానీ అమలు మాత్రం చేయడం లేదు. అంటే మాటలే గానీ చేతలు కనిపించడం లేదు. నూతన బియ్యం/తెల్ల కార్డుల కోసం లక్షలాది మంది దరఖాస్తుదారులు ఎదురుచూస్తున్నారు. ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్య ఖర్చుల పరిమితిని రూ.25లక్షలకు పెంచినట్లు రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. కానీ అర్హులైన లక్షలాది మందికి తెల్ల రేషన్‌కార్డులు అందలేదు. లబ్ధిదారుల దరఖాస్తులు సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. జగన్ అధికారంలోకి వచ్చాక వివిధ సాంకేతిక కారణాలతో కార్డులు తగ్గించారు. ఈ చర్య పేదల పొట్టకొట్టడమేనని విపక్షాలు విమర్శించాయి. బియ్యం కార్డులు లేనందున ఆరోగ్యశ్రీ సహా సంక్షేమ పథకాలు వర్తించవు. గతంలో గ్రామ/వార్డు సచివాలయాలు కేంద్రంగా నిర్వహించిన సురక్ష కార్యక్రమంలో తెల్లకార్డుల కోసం పెద్దఎత్తున అర్జీలు రాగా... వాటిపై ఇప్పటివరకు ఎలాంటి సమాచారం లేదు. అసలు కార్డులు వస్తాయో లేదో కూడా తెలియని పరిస్థితి ఉండటం దరఖాస్తుదారులను కలవరపెడుతోంది. ఇప్పటికే తెల్లకార్డుల రద్దుతో కొందరికి పింఛన్లు ఆగిపోయాయి. జనవరి నుంచి రూ.3వేల పింఛన్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రంలో 80 శాతం మంది తెల్లకార్డులపై ఆధారపడి ఉన్నారు. గతేడాది ఒకేసారి 15 లక్షల కార్డులు తొలగించారు. ఇందులో గ్రామ సచివాలయ పరిధిలో 10 శాతం, వార్డు సచివాలయాల పరిధిలో 15 శాతం కార్డులున్నాయి. టీడీపీ హయాంలో కోటి 57 లక్షల రేషన్ కార్డులు ఉంటే...జగన్ ప్రభుత్వం వచ్చాక 15 లక్షల రేషన్ కార్డులు తొలగించినట్లు సమాచారం. అంచెలంచెలుగా లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకోవడంతో ప్రభుత్వ లెక్కల ప్రకారం డిసెంబరు నాటికి 1,28,40,091 తెల్లకార్డులు పంపిణీ చేసినట్లుగా అధికారిక వెబ్‌సైట్‌లో చూపుతున్నారు. ఈ లెక్కలన్నీ అవాస్తవాలేనని విపక్షాలు మండిపడుతున్నాయి.

కొత్తకార్డులపై పరిశీలన ఏది?

గ్రామ, వార్డు సచివాలయాల్లో కొత్త బియ్యం కార్డుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. కనీసం ఆయా దరఖాస్తుల సమాచారాన్ని ఉన్నతస్థాయి అధికారులకు చేరవేయలేదని తెలిసింది. గ్రామ, వార్డు సచివాలయాల్లోనే పెద్దఎత్తున దరఖాస్తులు పేరుకుపోయాయి. కొత్త బియ్యం కార్డులకు అర్హత

- మిగతా 2 లో

మళ్లీ తుపాను
ముప్పే

- నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం
- వాతావరణ శాఖ హెచ్చరిక

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి : రాష్ట్రానికి మళ్లీ తుపాను ముప్పు పొంచి ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. నైరుతి బంగాళాఖాతంలో మరో ఉపరితల ఆవర్తనం ఏర్పడినట్లు వెల్లడించింది. దీనివల్ల సముద్రం నుంచి తమిళనాడుతో పాటు పరిసర ప్రాంతాల పైకి తూర్పు గాలులు వీస్తున్నాయి. ఈ ప్రభావంతో రానున్న 24 గంటల్లో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో చెదురుమదురుగా వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఉత్తర కోస్తాలో మాత్రం

- మిగతా 2 లో

అంగన్‌వాడీల సమస్యలు
తక్షణమే పరిష్కరించాలి

సీఎం జగన్‌కు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర–విజయవాడ : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించి, సమ్మె విరమణకు చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శనివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి లేఖ రాశారు. తమ న్యాయమైన కోర్కెలను తీర్చాలని కోరుతూ రాష్ట్రంలోని లక్ష మందికి పైగా అంగన్‌వాడీలు నిరవధిక సమ్మె చేస్తున్నారని తెలిపారు. నాలుగున్నరేళ్లుగా అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధి చూపలేదన్నారు. అంగన్‌వాడీలు అనేకసార్లు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని విమర్శించారు. దిక్కుతోచని స్థితిలో వేలాది మంది అంగన్‌వాడీలు ఈ ఏడాది మార్చి 20న ఒకసారి,



సెప్టెంబరు 25న మరోసారి చలో విజయవాడ కార్యక్రమం చేపట్టి నిరసన తెలిపారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో అంగన్‌వాడీ కార్మిక సంఘాలు డిసెంబరు 11న

- మిగతా 2 లో

'ఆ నాలుగు కలవరపెట్టాయ్'

- ఈసీ నియామకాల తీరు - గవర్నర్ల పనితీరు ఆక్షేపణీయం
- మంటగలుస్తున్న మానవహక్కులు - పత్రికా స్వేచ్ఛ
- అధికరణ 370 రద్దు ఫెడరలిజానికి దెబ్బ
- మోదీ పాలనలో పెరిగిన రాజ్యాంగ ఉల్లంఘనలు
- సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నారిమన్

న్యూదిల్లీ: మోదీ పాలనలో దేశంలో మానవహక్కుల హరణ, రాజ్యాంగ ఉల్లంఘనలు పెరిగినట్లు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రొహింగ్టన్ ఎఫ్. నారిమన్ విమర్శించారు. ఈ ఏడాది ప్రధానంగా నాలుగు అంశాలు కలవరపాటునకు గురిచేయాలని తెలిపారు. అవి ఆర్టికల్ 370పై సుప్రీంతీర్పు, ఎన్నికల కమిషనర్ల నియామక బిల్లుకు ఆమోదం, గవర్నర్ల పనితీరు, బీబీసీలో సోదాలని అన్నారు. ఆసియాటిక్ సొసైటీ అధ్వర్యంలో 'కాన్‌స్టిట్యూషన్: చెక్ అండ్ బ్యాలన్సెస్'పై ప్రసంగించిన జస్టిస్ నారిమన్... మోదీ పాలనాతీరును తీవ్రంగా దుయ్యబట్టారు. మోదీ అధికారంలోకి వచ్చాక దేశంలో మానవహక్కులు, పత్రికా స్వేచ్ఛ మంటగలుస్తున్నట్లు వ్యాఖ్యానించారు. రాజ్యాంగాన్ని

- మిగతా 2 లో

ఆత్మాహుతికి నిందితుల కుట్ర

పార్లమెంట్ భద్రతా ఉల్లంఘన కేసులో కొత్త కోణం

న్యూదిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పార్లమెంట్ భద్రతా ఉల్లంఘన కేసులో తాజాగా దిగ్భ్రాంతి కలిగే అంశాలు వెలుగులోకి వచ్చాయి. పార్లమెంట్‌లో పసుపు రంగు గ్యాస్ డబ్బాలతో గందరగోళం సృష్టించిన

నిందితులు...తొలుత తమని తాము నిప్పంటించుకోవాలని ప్రణాళికలు రచించినట్టు పోలీసులు తెలిపారు. అంతేకాకుండా కరపత్రాలు విసిరేయాలన్న వ్యూహం కూడా ఉందన్నారు. అయితే... చివరి నిమిషంలో ఆ ఆలోచనను విరమించుకొని, పసుపు రంగు గ్యాస్ డబ్బాలతో రచ్చచేసే ప్రణాళికతో నిందితులు ముందుకెళ్లినట్లు పోలీసులు వెల్లడించారు. ఇద్దరు నిందితులకు విజిటర్ పాస్‌లు జారీ చేసిన బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహా వాంగ్మూలాన్ని నమోదు చేయాలని దిల్లీ పోలీస్ ప్రత్యేక విభాగం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. 'లోక్‌సభ ఛాంబర్‌లోకి దూకే ప్రణాళికను ఖరారు చేయడానికి ముందు... తమ సందేశాన్ని ప్రభుత్వానికి బలంగా పంపేందుకుగాను నిందితులు ఇతర వ్యూహాలు

- మిగతా 2 లో

దేశం కోసం విరాళం

- క్రౌడ్ ఫండింగ్ పేరుతో విరాళాల సేకరణ
- బీజేపీ ఓటమికి కాంగ్రెస్ కాంగ్రెస్ కసరత్తు
- 18న మల్లికార్జున ఖర్గే శ్రీకారం

న్యూదిల్లీ: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నాయి. అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికలకు సమాయత్తమవుతున్నాయి. ఎన్నికల్లో సత్తా చాటేందుకు వనరులు సమకూర్చుకుంటున్నాయి. అందులో భాగంగా కాంగెస్ పార్టీ నిధుల వేటలో పడింది. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని నిలువరించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ఇండియా పేరుతో ప్రతిపక్ష పార్టీలన్నింటినీ ఏకతాటిపైకి తీసుకురావడం, భేషజాలకు పోకుండా

పట్టువిడుపులు ప్రదర్శించడం తగ్గించుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా బీజేపీ వ్యతిరేక, భావసారూప్యత గల పార్టీలతో పొత్తులు, సర్దుబాటు, అవగాహనతో ముందుకు సాగడం కోసం ప్రయత్నిస్తోంది. దీనికి ముందు నిధుల సేకరణ కార్యక్రమానికి సిద్ధమైంది. మెరుగైన భారత్ దిశగా...పార్టీ బలోపేతానికిగాను దేశవ్యాప్తంగా క్రౌడ్ ఫండింగ్‌కు వెళ్లనున్నట్లు వెల్లడించింది. 'డొనేట్ ఫర్ దేశ్' పేరిట నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి డిసెంబరు 18న పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శ్రీకారం చుట్టనున్నట్లు కాంగ్రెస్ నేతలు వెల్లడించారు. దీంతోపాటు పార్టీ 138వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని డిసెంబరు 28న మహారాష్ట్రలోని నాగపూర్‌లో 10 లక్షలమందితో భారీ సభ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో పార్టీ సీనియర్ నేతలు కేసీ వేణుగోపాల్, అజయ్ మాకెన్ మాట్లాడుతూ దాదాపు వందేళ్ల క్రితం 1920–21లో మహాత్మాగాంధీ ప్రారంభించిన చారిత్రక 'తిలక్ స్వరాజ్ ఫండ్' స్ఫూర్తితో ఈ నిధుల

- మిగతా 2 లో

విశాఖలో కబ్జా పాలన!

- వైసీపీ నేతలకు రాచబాట... జనానికి రాళ్లబాట
- అధికార పార్టీ నేతల ఆస్తులకు సౌకర్యాల కల్పనలో జీవీఎంసీ నిమగ్నం
- 20 లక్షల ప్రజలకు దక్కని మౌలిక సదుపాయాలు
- విస్తరణకు నోచుకోని అనేక మాస్టర్ ప్లాన్ రోడ్లు
- శివారు ప్రజలకు తప్పని రవాణా కష్టాలు



దస్పల్ల భూముల్లో భారీ ప్రాజెక్టు నిర్మాణానికి రోడ్డు విస్తరణకు రంగం సిద్ధం..

విశాలాంధ్ర బ్యూరో–విశాఖపట్నం : విశాఖ నగరంలో కబ్జా పాలన కొనసాగుతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన పక్కనబెట్టి అధికార పార్టీ నేతల ఆస్తులకు రాచబాట పరుస్తుండటంపై నగర ప్రజలు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కదిద్దుకోవాలన్న భావనతో నాలుగు తరాలకు సరిపడే కోట్లాది రూపాయల ఆస్తులు చేజిక్కించుకోవాలన్న కొంతమంది వైసీపీ నేతల తాపత్రయానికి విశాఖలో విలువైన ఆస్తులు ఇప్పటికే కబ్జాకు గురయ్యాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాటికి సకల సౌకర్యాలు కల్పించుకునేందుకు ప్రజలు కట్టే పన్ను సొమ్ముతో సోకు చేసుకోవాలని అధికారాన్ని అడ్డం పెట్టుకొని కొంతమంది చేస్తున్న దందాకు జీవీఎంసీ ఖజానా ఖాళీ అవుతోంది. వైసీపీ నేతల ఆస్తులకు మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా జీవీఎంసీ పని చేస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జీవీఎంసీ పరిధిలో 20 లక్షలకు పైగా ప్రజలు నివాసం ఉండే రహదారుల కంటే, వైసీపీ నేతలకు లబ్ధి చేకూర్చే రహదారులకే పెద్దపీట వేస్తోందని నగర ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ నేతలు తమ వ్యాపారాల అభివృద్ధి కోసం ప్రజాధనాన్ని విచ్చలవిడిగా ఉపయోగించుకుంటున్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని వైసీపీలోని కొంతమంది కీలక నేతల సిఫార్సులతో జిల్లా అధికారులు, జీవీఎంసీ అధికారులు, వీఎంఆర్డీఏ అధికారులు మారు మాట్లాడకుండా చెప్పిన పనులకు ప్రజాధనం కోట్లలో కేటాయిస్తున్నారు. సాధారణ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధికారులు ఏళ్ల తరబడి ముందుకు రావడం లేదు. అయితే వైసీపీ నేతలు ఎన్నికల ప్రకటన

- మిగతా 2 లో

ఇదీ లోకం!



దాన్దేముంది.. మనం రైళ్ళలోనూ లారీలలోనూ, టాక్సీలలో ఫ్రీ అందాం!

తప్పులే బీఆర్ఎస్‌ను ఓడించాయ్

26 ప్రజా సంఘాలను నిషేధించిన ఘనత వారిదే: కూనంనేని

విశాలాంధ్ర–హైదరాబాద్: బీఆర్ఎస్ చేసిన తప్పులే ఆ పార్టీని అధికారాన్ని దూరం చేశాయని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వ్యాఖ్యానించారు. 26 ప్రజా సంఘాలను నిషేధించిన ఘనత బీఆర్ఎస్‌దేనన్నారు. దళితులకు మూడెకరాల భూమి, రెండు పడకల ఇల్లు, దళిత బంధు, బీసీ బంధు వంటివన్నింటిని గత ప్రభుత్వం విస్మరించిందని దుయ్యబట్టారు. అసెంబ్లీ సమావేశాలకు ప్రతిపక్షం సహకరించాలని కోరారు. కేంద్రప్రభుత్వం నుంచి చాలా నిధులు రావాల్సి ఉన్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ చేసిన తప్పులను చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళ్లాలన్నారు. కొత్త ప్రభుత్వం ఎంత కాలం ఉంటుందో చూస్తామని బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు అనడం తగదన్నారు.

కొందరు ఎమ్మెల్యేలు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని కూనంనేని విమర్శించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఈ ఎన్నికల్లో ఓడిపోయారన్నారు. ఎమ్మెల్యేల కొనుగోలు సరైంది కాదని అన్నారు. గత ప్రభుత్వం కోదండరాం, రేవంత్‌రెడ్డిని, కమ్యూనిస్టులను గృహనిర్బంధంలో ఉంచిందని గుర్తు చేశారు. స్వేచ్ఛ తెలంగాణ కావాలన్నారు. ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు ఎందుకు ఇవ్వలేదో చెప్పాలన్నారు. విద్యార్థులకు ఉపకార వేతనాలు ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు.

గాజాలో శాంతి, సుస్థిరతకు కృషిచేద్దాం

ఇస్లామిక్-యూరోపియన్ దేశాల ప్రతిజ్ఞ

ఓస్లో/జెరూసలేం: గాజాలో సంక్షోభానికి శాంతియుత పరిష్కారం, ప్రాదేశిక సుస్థిరతను పెంపొందించేందుకు ఇస్లామిక్, ఉత్తర ఐరోపా దేశాలు సంకల్పించాయి. నార్వే విదేశాంగ మంత్రి ఎస్పెన్ బర్త్ అయిడె అధ్వర్యంలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో అగ్ర నాయకులు ఈ మేరకు ప్రతిజ్ఞ చేశారు. సౌదీ అరేబియా విదేశాంగ మంత్రి ఫైసల్ బిన్ ఫర్హాన్ అల్ సౌద్ విజ్ఞప్తితో వీరంతా సమావేశమయ్యారు. ఖతార్, జోర్డాన్, పలస్తీనా, టర్కీ, డెన్మార్క్, ఐస్‌ల్యాండ్, స్వీడెన్, బెల్జియం, నెథర్లాండ్స్, లగ్జంబర్గ్ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. గాజాలోని దారుణ స్థితిపై తామంతా ఒకేలా స్పందిస్తున్నట్లు ఎస్పెన్ బర్త్ ఓ ప్రకటన చేశారు. ఈ మారణహోమం ఆగాలని ప్రతి ఒక్కరు తేల్చిచెప్పినట్లు వెల్లడించారు. 'టూ-స్టేట్' పరిష్కారానికి అంతర్జాతీయ సహకారాన్ని పునరుద్ధరించడం, పలస్తీనా యంత్రాంగాన్ని బలపర్చడమే అజెండాగా ఈ ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఇప్పటివరకు 76.5 మిలియన్ డాలర్ల మేర సాయాన్ని పలస్తీనాకు నార్వే చేసినట్లు ఎస్పెన్ బర్త్ తెలిపారు. పలస్తీనాకు తమ మద్దతు ఎప్పుడు ఉంటుందని స్పష్టంచేశారు.

జబాలియా ఇళ్లపై ఇజ్రాయిల్ దాడులు

హమాస్ నాయకులే లక్ష్యంగా ఇజ్రాయిల్ సైన్యం గాజాలో భూతల, వైమానిక దాడులు తీవ్రస్థాయిలో జరుపుతూ పౌరుల ప్రాణాలను హరించేందుకు ఏ మాత్రం వెనుకాడటం లేదు. పిల్లలు, వృద్ధులు, మహిళలన్న దయ లేకుండా భీకర దాడులు జరుపుతోంది. ఇప్పటికే 19వేల చేరువకు పలస్తీనియన్ల మరణాలు చేరాయి. శనివారం జబలియాలోని రెండు ఇళ్లపై ఇజ్రాయిల్ దళాలు జరిపిన దాడుల్లో 14 మంది మృత్యువాత పడ్డారు. మరొక ఇంటిపై దాడిలో పదుల సంఖ్యలో మరణాలు సంభవించాయి. ఈ మేరకు డబ్ల్యూఏఎఫ్ఏ వార్తాసంస్థ వెల్లడించింది. శిథిలాల కింద అనేకమంది చిక్కుకుపోయారని, మృతుల సంఖ్య పెరగవచ్చని పలస్తీనా ఏజెన్సీ నివేదించింది.

అది ప్రతిఘటనే: ఐడీఎఫ్

తమ దళాలపై కాల్పులను ప్రతిఘటించేందుకు జబాలియా భవనంపై వైమానిక దాడి జరిపినట్లు ఇజ్రాయిల్ సైన్యం తెలిపింది. ఓ ఇంటి పైకప్పుపై హమాస్ సైన్యాన్ని గుర్తించి దాడి చేసినట్లు వెల్లడించింది. గాజా నగరంలోని రెండు బడుల్లో ఉన్న తీవ్రవాదులను హతమార్చినట్లు ప్రకటించింది. అలాగే ఖాన్ యూనియస్‌లోని ఆయుధగారాన్ని సోదా చేసినట్లు తెలిపింది. హమాస్ అంతర్‌గ్రౌండ్ స్థావరాన్ని వెలికితీసినట్లు పేర్కొంది.

పొరపాటున బందీలను కాల్చివేశాం

తమ దేశానికి చెందిన ముగ్గురు బందీలను శత్రువులుగా పొరబడి వారిని సైన్యం కాల్చి చంపిందని ఐడీఎఫ్ వెల్లడించింది. మృతులను ఇజ్రాయిల్‌లోని కెఫార్ అజా ప్రాంతానికి చెందిన యోటమ్ హైమ్, కిబుట్జ్ నిర్ అమ్ ప్రాంతానికి చెందిన వారిగా గుర్తించింది. మూడో వ్యక్తి పేరును కుటుంబ సభ్యుల విజ్ఞప్తి మేరకు గోప్యంగా ఉంచారు. గాజాలో నరమేధాన్ని ఆపాలని అంతర్జాతీయ సంస్థలు, మానవతా సాయం కొనసాగించాలని, దాడుల తీవ్రతను తగ్గించాలని అమెరికా కోరుతున్నా ఇజ్రాయిల్ మొండిగా వ్యవహరిస్తోంది.

నెతాన్యాహు దిగ్భ్రాంతి

బందీలను తమ దళాలు కల్చి చంపిన ఘటనపై ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. 'ఇది విషాదకరం. తమ ప్రాణాలు పణంగా పెట్టి బందీలను విడిపించేందుకు పోరాడుతోన్న మన సైనికులు మనోబలంతో సాగాలని కోరుకుంటున్నా. బందీలను సురక్షితంగా తీసుకు వచ్చేందుకు గాయాలు కనిపించకుండా, పాఠాలు నేర్చుకుంటూ ముందుకెళుతున్నాం' అని పేర్కొన్నారు. తాజా ఘటనపై సమగ్ర దర్యాప్తు జరుపుతామని కూడా ఆయన హామీనిచ్చారు. ఇదే అంశమై అమెరికా అధ్యక్షుడు బైడెన్ విచారం వ్యక్తంచేశారు. తన భద్రతా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. తాజా ఘటనపై విచారణ జరిపించాలని ఇజ్రాయిల్‌కు సూచించారు. ఈ మేరకు శ్వేతసౌధ భద్రతా మండలి ప్రతినిధి జాన్ కిర్బీ తెలిపారు.

పాకిస్థాన్ ఎన్నికలకు వేళాయే

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో సార్వత్రిక ఎన్నికలు ఫిబ్రవరి 8న జరగనున్నాయి. ఎప్పుడెప్పుడా అని అంతా ఎదురు చూస్తున్న ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైంది. ఈ ఎన్నికలను జాప్యం చేసే వీలున్న లాహోర్ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేసిన కొన్ని గంటల్లోనే షెడ్యూల్‌ను పాకిస్థాన్ ఎన్నికల సంఘం (ఈసీపీ) ప్రకటించింది. ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నట్లు సీఈసీ సికిందర్ సుల్తాన్ రాజా తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఈనెల 20-22 తేదీల్లో రిటర్నింగ్ అధికారులు (ఆర్ఓలు) వద్ద నామినేషన్లు దాఖలు చేయొచ్చు. అలాగే ఈనెల 23న అభ్యర్థులు ఖరారవుతారు. ఈనెల 24-30 తేదీల్లో నామినేషన్ల పరిశీలన, జనవరి 10లోపు అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు అభ్యర్థుల ఫిర్యాదుకు అవకాశం ఉంటుంది.

50 ఏళ్ల స్నేహం-సహకారం

ఆసియన్-జపాన్ సదస్సు ప్రారంభం

టోక్యో: అసోసియేషన్ ఆఫ్ సౌతీస్ట్ ఆసియన్ నేషన్స్ (ఆసియన్)తో జపాన్ స్నేహం-సహకార బంధానికి 50ఏళ్లు అయ్యాయి. దీనిని పురస్కరించుకొని టోక్యోలో మూడు రోజుల సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ సదస్సు శనివారం ప్రారంభమైంది. జపాన్ ప్రధాని ఫుమియో కిషిదా ఆహ్వానం మేరకు దీనిని దీనికి ఆసియన్ ప్రధాన కార్యదర్శి కావో కిమ్ హార్న్ (కంబోడియా) విచ్చేశారు. ఇండోనేసియా అధ్యక్షుడు జోకో విడోడోతో కలిసి కిషిదా అధ్యక్షత్వం వహించగా అసోసియేషన్ ఆఫ్ సౌతీస్ట్ ఆసియన్ నేషన్స్ (ఆసియన్) అధ్యక్ష బాధ్యతలు ఇండోనేషియా చేపడుతోంది. కిషిదా ఆదివారం విందు కూడా ఇవ్వనున్నారు. ఆసియన్ నేతలతో ద్వైపాక్షిక భేటీలు జరుపుతారు. ఆసియన్-జపాన్

సంబంధాల్లో ఇప్పటివరకు జరిగిన పురోగతి, భవిష్యత్ కార్యాచరణ, సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం పెంచుకోవడంపై ఈ సదస్సు ప్రధానంగా దృష్టిని కేంద్రీకరిస్తుంది.

2024లో ఏడు ఖండాంతర క్షిపణి ప్రయోగాలు

మాస్కో: వచ్చే సంవత్సరం ఏడు ఖండాంతర బాలిస్టిక్ క్షిపణలు (ఐసీబీఎంలు) ప్రయోగించాలని రష్యా యోచిస్తోందని రష్యన్ స్ట్రాటిజిక్ మిసైల్ ఫోర్సెస్ (ఎస్ఎంఎఫ్) కమాండర్, లెఫ్టినెంట్ జనరల్ సెర్గి కరాకయేవ్ వెల్లడించారు. రష్యా వారాసంస్థ రెడ్‌స్టార్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వివరాలు తెలిపారు. ఐదేళ్లలో 20కుపైగా ఐసీబీఎంలను పరీక్షించినట్లు వెల్లడించారు. రష్యా సాయుధ దళాల శిక్షణా విన్యాసాలు, కొత్త మిసైల్ వ్యవస్థల పరీక్షలలో భాగంగా ఈ ప్రయోగాలను ఎస్ఎంఎఫ్ చేపట్టినట్లు చెప్పారు. యుద్ధం కోసం తయారు చేసిన హైపర్‌సోనిక్ వార్‌హెడ్‌తో కూడుకున్న 'అవన్‌గార్డ్' కాంపెక్స్‌ను ఓరెంబర్గ్ ప్రాంతంలోని యాస్నీ

ఫార్మేషన్ నుంచి పరీక్షించినట్లు తెలిపారు. 2024లో ఏడు ప్రయోగాలకు ప్రణాళికలు రూపొందుతున్నట్లు వెల్లడించారు. ఖండాంతర క్షిపణలు, జలాంతర్గాముల-బాలిస్టిక్ క్షిపణుల (ఎస్ఎల్‌బీఎంలు) ప్రయోగాలకు సంబంధించిన సమాచారాన్ని రష్యా, అమెరికా పరస్పరం పంచుకుంటాయని కరాకయేవ్ తెలిపారు. పూర్వం సోవియన్ యూనియన్, అమెరికాకు మధ్య 1988లో జరిగిన ఒప్పందం ప్రకారం క్షిపణుల ప్రయోగానికి 24 గంటల ముందే అమెరికాకు రష్యా నుంచి సమాచారం వెళుతుందని చెప్పారు. ప్రయోగం తేదీ, ప్రదేశం, ప్రభావం వంటి వివరాలను ముందస్తుగానే అమెరికాకు రష్యా చేరవేస్తుందని కరాకయేవ్ తెలిపారు.

దేశం కోసం విరాళం

(మొదటిపేజీ తరువాయి)

సమీకరణ చేపడుతున్నట్లు తెలిపారు. 18 ఏళ్లు పైబడిన భారతీయులెవరైనా రూ.138 మొదలు రూ.1380, రూ.13,800...ఇలా విరాళం ఇవ్వవచ్చని చెప్పారు. 138 ఏళ్ల కాంగ్రెస్ ప్రయాణాన్ని ఇది గుర్తు చేస్తుందన్నారు. డిసెంబరు 28 వరకు ప్రధానంగా ఆన్‌లైన్ వేదికగా, తర్వాత క్షేత్రస్థాయిలో విరాళాల సేకరణ చేపడతామని తెలిపారు. డిసెంబరు 28న నాగపూర్‌లో భారీ సభ నిర్వహిస్తామని, ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా పార్టీ శ్రేణులు సహా దాదాపు 10 లక్షల మంది హాజరవుతారని చెప్పారు. కాగా, అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్(ఏడీఆర్) సంస్థ ఇటీవలి గణాంకాల ప్రకారం కాంగ్రెస్ నిధుల విలువ రూ.805 కోట్లుగా ఉంది. మరోపక్క బీజేపీ నిధుల విలువ భారీస్థాయిలో రూ.6,046 కోట్లుగా ఉంది. హస్తం పార్టీకి అందుతోన్న విరాళాలు గత ఏడేళ్లలో తగ్గుముఖం పట్టాయి. అదే సమయంలో బీజేపీకి ప్రకటించిన కార్పొరేట్ విరాళాల మొత్తం... అన్ని జాతీయ పార్టీలకు అందిన విరాళాల కంటే మూడు రెట్లు ఎక్కువ. 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఆ మొత్తం 18 రెట్లు ఎక్కువగా ఉండటం గమనార్హం. ఈ క్రమంలోనే ఎన్నికల వేళ నిధుల కొరతను అధిగమించేందుకు కాంగ్రెస్ 'క్రౌడ్ ఫండింగ్'కు ముందుకొచ్చినట్లు సమాచారం. 2019 సార్వత్రిక ఎన్నికల ముందు కూడా కాంగ్రెస్ పార్టీ ఇదే దారి అనుసరించింది.

ఒమన్ సుల్తాన్‌తో మోదీ భేటీ

ద్వైపాక్షిక సహకారానికి గ్రీన్‌సిగ్నల్

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ఒమన్ సుల్తాన్ హైతమ్ బిన్ తారిక్‌తో భేటీ అయ్యారు. ఇద్దరి మధ్య కీలక చర్చలు జరిగాయి. వాణిజ్యం, పెట్టుబడులతో పాటు విభిన్న రంగాల్లో ద్వైపాక్షిక సహకారం విస్తరణపై తారిక్‌తో మోదీ చర్చించారు. భారత్ పర్యటనలో భాగంగా ఒమన్ సుల్తాన్ శుక్రవారం ఢిల్లీకి వచ్చారు. గల్ఫ్ దేశానికి చెందిన ఒక అగ్రనాయకుడు భారత్ పర్యటనకు రావడం ఇదే మొదటిసారి. భారత్-ఒమన్ వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఊతమిస్తూ... హైదరాబాద్ హౌస్‌కు హైతమ్ బిన్ తారిక్‌ను మోదీ సాదరంగా ఆహ్వానించారు. ఇద్దరి మధ్య రెండు దేశాల ద్వైపాక్షిక చర్చలకు ఈ హైదరాబాద్ హౌస్ వేదికగా నిలిచిందని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి అరిందమ్ బాగ్చీ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ ఎజెండాలో ద్వైపాక్షిక సంబంధాలను పరిగణనలోకి తీసుకోవడం, రెండు దేశాల మధ్య భవిష్యత్ సహకారం కోసం మార్గాలను నిర్ణయించడం వంటివి ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. ఉదయం రాష్ట్రపతి భవన్ ముందు కోర్టులో సుల్తాన్ బిన్ తారిక్‌కు

లాంఛనప్రాయ స్వాగతం లభించింది. హైతమ్ బిన్ తారిక్ మొదటి భారతదేశపు పర్యటన. ఇది భారత్, ఒమన్ మధ్య దౌత్య సంబంధాలకు కీలక మైలురాయిని సూచిస్తుందని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇంతకుముందే ట్వీట్‌లో పేర్కొంది. వ్యూహాత్మక భాగస్వాములైన భారత్, ఒమన్ మధ్య ద్వైపాక్షిక, వాణిజ్యం, పెట్టుబడి సంబంధాలు కొన్నేళ్లుగా పురోగమిస్తున్నాయి.

అంగన్‌వాడీల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

(మొదటిపేజీ తరువాయి)

చర్చలు జరిపినా ఫలితం లేదని, అనివార్య పరిస్థితుల్లో డిసెంబరు 12 నుంచి అంగన్‌వాడీలు నిరవధిక సమ్మె చేపట్టారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయడంలో అంగన్‌వాడీల పాత్ర కీలకం అని అన్నారు. గర్భిణీలకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించడం వల్ల స్త్రీ, శిశు సంక్షేమానికి ఎంతో తోడ్పడుతున్నారని తెలిపారు. పిల్లలకు చదువు, పౌష్టికాహారాన్ని వారు అందిస్తున్నారని చెప్పారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్ల సమస్యలను తక్షణం పరిష్కరించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలేదనని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా కార్మికులను బెదిరింపులకు గురిచేయడం, అధికారులు హెచ్చరికలు చేయడం, నిర్బంధాన్ని ప్రయోగించడం తగదన్నారు. కొన్ని చోట్ల అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలగొడుతున్నారని, ఇది సరైంది కాదన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు అధికారంలోకి వస్తే తెలంగాణ కంటే రూ.1000 పెంచి అంగన్‌వాడీలకు వేతనంగా ఇస్తామన్నారని, తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం అంగన్‌వాడీల వేతనం రూ.18 వేలు చేస్తూ జీవో జారీ చేసిందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత నాలుగున్నర ఏళ్లలో అంగన్‌వాడీల కోర్కెలను విస్మరించారని రామకృష్ణ విమర్శించారు. సుప్రీం కోర్టు ఆదేశాలను కూడా తుంగలో తొక్కారని, ఇది మాట తప్పి, మడమ తిప్పడం కాదా? అని నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలపై చర్యలు చేపట్టాలనుకోవడం దుర్మార్గం అన్నారు. అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించేందుకు ఇప్పటికైనా తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. కనీసం తెలంగాణలో మాదిరిగా అంగన్‌వాడీల జీతాలను పెంపుదల చేసి, వారి న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సామరస్యపూర్వక వాతావరణంలో తక్షణమే చర్చల ద్వారా అంగన్‌వాడీల సమ్మె విరమణకు ముఖ్యమంత్రిగా చొరవ తీసుకోవాలని కోరారు.

ఆత్మాహుతికి నిందితుల కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

రచించారని ఓ పోలీసు అధికారిచెప్పారు. తమ శరీరాలను ఫైర్‌ప్రూఫ్ జెల్‌తో కప్పుకొని, తమని తాము నిప్పంటించుకోవాలని నిర్ణయించుకున్నారని, పార్లమెంటు లోపల కరపత్రాలు విసిరేయాలని కూడా భావించారన్నారు. కానీ...చివరి నిమిషంలో ఈ రెండు పథకాలను విరమించుకొని.. బుధవారం అమలు చేసిన ప్రణాళికతో ముందుకు సాగారని వివరించారు. ఈ కేసుకు సంబంధించి మైసూర్‌కు చెందిన బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహా వాంగ్మూలాన్ని నమోదు చేయాలని స్పెషల్ సెల్ కౌంటర్ ఇంటెలిజెన్స్ బృందం యోచిస్తోందని పీటీఐ నివేదించింది. మరోవైపు.. అధికారులు తమ దర్యాప్తులో భాగంగా శుక్రవారం రాత్రి నిందితులను గతంలో వాళ్లు కలిసి, పార్లమెంట్ భద్రతా ఉల్లంఘన కుట్ర పన్నిన ప్రాంతాలకు తీసుకెళ్లారు. ఈ ఉల్లంఘనని రీక్రియేట్ చేసేందుకుగాను పోలీసులు పార్లమెంటు అనుమతి కోరే అవకాశం ఉందని తెలిసింది. నలుగురు నిందితులు ఏడు పొగ గొట్టాలతో గందరగోళం సృష్టించేందుకు వచ్చారని ఢిల్లీ పోలీసు వర్గాలు తెలిపాయి. నిందితులు గూగుల్‌లో పార్లమెంటు పరిసర ప్రాంతాలు శోధించారని, పార్లమెంటు భద్రతకు సంబంధించిన పాత వీడియోలు కలిగి ఉన్నారని వెల్లడించాయి.

మరో నిందితుడి అరెస్ట్

పార్లమెంటు భద్రతా ఉల్లంఘన కేసులో ఢిల్లీ పోలీసులు శనివారం మరొక నిందితుడు మహేశ్ కుమావత్‌ను అరెస్టు చేశారు. అనంతరం ఢిల్లీ కోర్టు అతనికి ఏడు రోజుల పోలీసు కస్టడీ విధించింది. పార్లమెంటులో సందర్శకుల గ్యాలరీ నుంచి కింద సభ్యుల సీట్ల పైకి దూకి పొగ బాంబులు వదిలిన ఘటన దేశంలో తీవ్ర అలజడి రేపింది. పార్లమెంటులో సభ్యుల భద్రతపై అనేక సందేహాలు లేవనెత్తింది. ఈ ఘటనకు 'ప్రధాన సూత్రధారి'గా ఆరోపణలు ఎదుర్కొంటున్న లలిత్ ఝా ఢిల్లీ నుంచి తప్పించుకోవడానికి సహకరించాడన్న ఆరోపణలపై మహేశ్ కుమావత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం రాత్రి లలిత్ ఝాతో కలిసి మహేష్ కుమావత్ స్వయంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చారని, ఇద్దరినీ ఢిల్లీ పోలీసుల ప్రత్యేక విభాగానికి అప్పగించినట్లు అధికారి తెలిపారు. అప్పటి నుంచి మహేశ్‌ను విచారణ చేస్తున్నారు. కాగా, నిందితుడు సృష్టించిన ఇప్పుడు తొలగించబడిన భగత్ సింగ్ ఫ్యాన్ క్లబ్ పేజీలో మహేశ్ సభ్యుడు. సాక్ష్యాలను ధ్వంసం చేయడం, నేరపూరిత కుట్ర ఆరోపణలపై కుమావత్‌ను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. డిసెంబరు 13న జరిగిన సంఘటనను పునర్నిర్మించేందుకు పోలీసులు పార్లమెంటు అనుమతిని కోరే అవకాశం ఉందని ఆ వర్గాలు తెలిపాయి. ఈ ఉల్లంఘన వెనుక సూత్రధారి అని భావిస్తున్న లలిత్ ఝాను కూడా పోలీసులు ప్రశ్నిస్తున్నారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఝాను గత రాత్రి అరెస్టు చేసిన తర్వాత శుక్రవారం ఏడు రోజుల పోలీసు కస్టడీకి పంపారు. పార్లమెంటు భద్రతను ఉల్లంఘించేందుకు కుట్ర పన్నేందుకు నిందితులు చాలాసార్లు కలిశారని ఆయన అంగీకరించారని పాటియాలా హౌస్ కోర్టులో పోలీసులు పేర్కొన్నారు. అంతేకాకుండా, నిందితుడికి ఏదైనా శత్రు దేశం లేదా ఉగ్రవాద సంస్థతో సంబంధం ఉందా అని నిర్ధారించడానికి అతన్ని కూడా విచారించాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

మాటలే.. చేతల్లేవ్

(మొదటిపేజీ తరువాయి)

ఉండి...సకాలంలో కార్డులు పంపిణీ చేయకపోవడంతో లబ్ధిదారులు ఇతర సంక్షేమ పథకాలకు సంబంధించి అన్యాయానికి గురవుతున్నారు. పెన్షన్లు, చేయూత, చేదోడు, ఆసరా, అమ్మఒడి తదితర సంక్షేమ పథకాలకు పేదలు దూరమవుతున్నారు. ఇప్పటివరకు లక్షల్లోనే పెన్షన్లు రద్దయినట్లు తెలుస్తోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ సరిగ్గా లేనందున విద్యార్థుల పరిస్థితి దయనీయంగా మారింది. కొత్తగా బియ్యం కార్డులు ఇస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం...పాత వారి సంక్షేమాలు తొలగిస్తూ తెలివిగా వ్యవహరిస్తోందని లబ్ధిదారులు వాపోతున్నారు. అధికారంలోకి రాక ముందు ప్రతి ఆర్నెళ్లకు ఒకసారి బియ్యం కార్డులు, పెన్షన్లు మంజూరు చేస్తామని జగన్ ప్రకటించారు. అధికారంలోకి వచ్చాక ఆ మాట విస్మరించినట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. మరో మూడు నెలల్లో ఎన్నికలు జరగనుండటంతో సీఎం జగన్ అత్యధికంగా పార్టీ కార్యక్రమాలపైనే దృష్టి పెట్టారు. ఎమ్మెల్యేల మార్పిడి, కొత్త వారిని పార్టీలోకి ఆహ్వానించడం తదితర కార్యక్రమాల్లో ఆయన నిమగ్నమయ్యారు. బియ్యం కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులపై ఇంతవరకు ప్రభుత్వం స్పందించలేదు. స్థానికంగా ఎమ్మెల్యేలను కలిసినప్పటికీ, సరిగ్గా స్పందించడం లేదని, వలంటీర్లను కలవాలని తమకు సూచిస్తున్నట్లు బాధితులు వాపోతున్నారు. కొత్తకార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించి...వాటిని ఇవ్వకుండా ప్రభుత్వం మోసగిస్తోందని మండిపడుతున్నారు.

ఆరోగ్యశ్రీ సేవలకు నిరాకరణ

మూడు నెలల్లో ప్రభుత్వ కాలపరిమితి ముగియనుండటంతో ఆరోగ్యశ్రీ కార్డులపై ఉచితంగా వైద్య చికిత్సలు చేసేందుకు చాలా నెట్ వర్క్ ఆస్పత్రులు నిరాకరిస్తున్నట్లు బాధితులు చెబుతున్నారు. ఇప్పటికే నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీకి సంబంధించి కోట్ల రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. రావాల్సిన బిల్లులే ఇవ్వకుంటే కొత్తగా ఆరోగ్యశ్రీ కింద వైద్యం చేస్తే తమ పరిస్థితి ఏమిటన్న ఆందోళన నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యంలో నెలకొంది. రెండు, మూడు నెలలుగా వీలైనంత వరకు ఆరోగ్యశ్రీ కేసులు తగ్గిస్తున్నారు. విజయవాడ, గుంటూరు, తిరుపతి, విశాఖపట్నంలోని ప్రైవేట్ ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ సేవలపై అంతగా ఆసక్తి చూపడం లేదు. ఎమర్జెన్సీ కేసులకు సైతం ఆపరేషన్లు చేసేందుకు నిరాకరిస్తున్నట్లు తెలిసింది. మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సుతో వెళ్లిన వారినే ఆస్పత్రుల్లో చేర్చుకుం టున్నారు. ఎన్నికల చివరి దశలో ఆరోగ్యశ్రీ పరిమితి రూ.25లక్షలకు ప్రభుత్వం పెంచడం వల్ల ఉపయోగం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో వైద్య సేవలకు వెళ్లిన వారిని ఆరోగ్యశ్రీ కింద అనుమతించడం లేదు. ఉద్యోగుల ఆరోగ్య పథకం అధ్వానంగా మారింది. మొక్కుబడిగా కొన్ని ఆస్పత్రులే అంగీకరిస్తున్నాయి. ఆరోగ్యశ్రీపై ప్రభుత్వం ఆర్భాటంగా చేస్తున్న ప్రచారానికి, ఆచరణలో అమలుకు పొంతన కనిపించడం లేదు. ఇప్పటికైనా జగన్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వడంపై దృష్టి పెట్టాలి. లేకపోతే ఎన్నికల గిమ్మిక్కుగానే పరిగణించి...ప్రభుత్వంపై ప్రతీకారం తీర్చుకుంటారు. అర్హులందరికీ రేషన్ కార్డులు ఇచ్చి...సంక్షేమ పథకాలలో కోత వేయకుండా చూడాల్సిన అవసరం ఉంది.

మళ్లీ తుపాను ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

పొడి వాతావరణం ఉంటుందని వెల్లడించింది. వాతావరణశాఖ అంచనా ప్రకారం బాపట్ల, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, శ్రీసత్యసాయి, తిరుపతి, కడప జిల్లాల్లో తేలికపాటి నుంచి మోసర్తు వర్షాలు కురుస్తాయి. ఇక రాష్ట్రం పైకి వీస్తున్న పొడిగాలులతో కోస్తా, రాయలసీమల్లో ఏజెన్సీ ప్రాంతంతో పాటు శివారు ప్రాంతాల్లో చలి వణికిస్తోంది. పాడేరు, చింతపల్లి, అరకు ప్రాంతాల్లో పొగ మంచు తీవ్రంగా కమ్మేస్తోంది. తుపాను తర్వాత ఈ తరహా వాతావరణం రోజురోజుకు పెరుగుతోంది. ముఖ్యంగా రాత్రి పూట ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. చల్లటి గాలులకు పొగమంచు తోడవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మిచౌంగ్ తుపాను నుంచి కోలుకోకముందే మరో తుపాను ముప్పు పొంచి ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. మాగాణి, మెట్ట పంటలు దిగుబడి దశలో ఉన్న స్థితితో మిచౌంగ్ తుపాను పంటను తుడిచిపెట్టింది. ఇప్పటివరకు పంట నష్టపరిహారం ఎంత జరిగిందన్న అంచనా నివేదికలు కూడా సిద్ధం కాలేదు. కేంద్ర బృందాలు ప్రస్తుతం పంట నష్టాన్ని పరిశీలిస్తున్నాయి. నష్టపరిహారంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆపన్నహస్తం కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్న పరిస్థితుల్లో మరో తుపాను హెచ్చరిక వారిని తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది.

'ఆ నాలుగు కలవరపెట్టాయ్'

(మొదటిపేజీ తరువాయి)

ఉల్లంఘించడం తీవ్రమైందన్నారు. 2002 గుజరాత్ అల్లర్లలో ప్రధాని మోదీ పాత్రపై బీబీసీ డాక్యుమెంటరీని నిషేధించడం, ఎన్నికల కమిషనర్ల ఎంపిక కమిటీ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగించి, ఆయన స్థానంలో మంత్రిని నియమించడం, కేరళ గవర్నర్ బిల్లులను రాష్ట్రపతికి పంపడంపై జస్టిస్ నారిమన్ తీవ్ర అసహనం వ్యక్తంచేశారు.

ఫిబ్రవరిలో బీబీసీను సోదాల ద్వారా వేధించారని జస్టిస్ నారిమన్ గుర్తుచేశారు. మీడియా హక్కుల ఉల్లంఘనలలో కోర్టుల పాత్ర గురించీ మాట్లాడారు. మీడియాపై దాడి జరిగితే న్యాయస్థానాలు వెంటనే స్పందించి వాటిని అడ్డుకోవాలన్నారు. స్వతంత్రంగా జరిగిన వార్తా సేకరణ... సోదాలకు దారితీస్తే వాటిని చట్టవ్యతిరేకం, రాజ్యాంగ విరుద్ధమని కోర్టులు ఆక్షేపించాలి, 'వాచ్ డాగ్' మీడియా లేకపోతే ఇక మిగిలేది ఏమిటని ఆందోళన వ్యక్తంచేశారు. పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామ్యంపై మోదీ ప్రభుత్వ దాడులను ప్రముఖ జర్నలిస్టుల అరెస్టులు, సోదాలే నిదర్శనాలన్నారు. కాగా, పత్రికా స్వేచ్ఛ సూచీలో 180 దేశాల్లో భారత్ స్థానం 161గా ఉంది.

'కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ల నియామకాల బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందింది. ఇది కలవరానికి గురిచేసింది. ఇలాంటి పద్ధతి ప్రకారం ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్లను నియమిస్తే ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎలా జరుగుతాయి' అని జస్టిస్ నారిమన్ ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్నికల సంఘం స్వతంత్ర పనితీరు తీవ్రస్థాయిలో ప్రభావితం కాగలదన్నారు. కేరళ గవర్నర్ తీరునూ తప్పుపట్టారు. శాసనసభ ఆమోదించిన బిల్లులను 23 నెలలు పెండింగ్ ఉంచి, సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసిన తర్వాత ఒక దానికి ఆమోదముద్ర వేసి, మిగతా ఏడు బిల్లులను రాష్ట్రపతికి పంపడం విజ్ఞత అనిపించుకోదని ఆక్షేపించారు. 'స్వతంత్రంగా పనిచేసే వారినే అత్యున్నత హోదాల్లో నియమించేలా సుప్రీంకోర్టు తీర్పుచెప్పే రోజు కోసం ఎదురు చూస్తున్నా. నెలల పాటు బిల్లులను ఆమోదించకుండా పెండింగ్‌లో ఉంచి చివరకు రాష్ట్రపతికి పంపిన కేరళలో ఉన్న వంటి వారితో కాదు' అని జస్టిస్ నారిమన్ వ్యాఖ్యానించారు.

ఇక ఆర్టికల్ 370పై సుప్రీంకోర్టు తీర్పును ప్రస్తావిస్తూ ఇది తనను ఎంతగానో కలవరపెట్టిందని చెప్పారు. తాజా పరిణామంతో ఫెడరలిజం (సమాఖ్యవాదం)పై ప్రభావంగా తీవ్రంగా ఉంటుందన్నారు. ఆర్టికల్ 356తో రాష్ట్రపతి పాలన అమల్లో ఉన్నప్పుడు రాష్ట్రాన్ని విభజించడం వెనుక పెద్ద కారణం లేకపోలేదని చెప్పారు. 'ఆర్టికల్ 356 కింద రాజ్యాంగ నిబంధనల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం సరిగ్గా పనిచేయకపోతే పూర్తి నియంత్రణను కేంద్రం తీసుకోవచ్చు. కానీ సుప్రీంకోర్టు దీని గురించి ఎందుకు ప్రశ్నించలేదు! రాష్ట్ర హోదా విషయంలో సొలిసిటర్ జనరల్ చెప్పినదే ఆధారంగా నిర్ణయం తీసుకోవడం తగదు. 2019 జరిగిన ఘటనపై అప్పట్లో అనేక ఫిర్యాదులు దాఖలైతే తీర్పు రావడానికి నాలుగేళ్లు పట్టింది. అంటే ఐదేళ్లుగా ఆ ప్రాంతం ప్రజాస్వామికంగా ఎన్నికైన ప్రభుత్వ పాలనకు దూరమైంది' అని జస్టిస్ నారిమన్ వ్యాఖ్యానించారు. ఆర్టికల్ 370 విషయంలో సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకోవడానికి నిరాకరించడం వల్ల రాజ్యాంగ విరుద్ధమైన చర్య కొనసాగించడానికి అనుమతిచ్చినట్లు అవుతుందన్నారు. కొలీజియం వ్యవస్థ గురించి మాట్లాడుతూ రిటైర్డ్ న్యాయమూర్తులతో కూడిన కొలీజియాన్ని సూచిస్తానని జస్టిస్ నారిమన్ అన్నారు. అందులో ఉండేవారు ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతారన్నారు. ప్రధాన న్యాయమూర్తి, సీనియర్ న్యాయమూర్తుల సూచనలు తీసుకుంటారని, ఆపై న్యాయమూర్తులను సిఫార్సు చేస్తారన్నారు.

విశాఖలో కబ్జా పాలన!

(మొదటిపేజీ తరువాయి)

రాకముందే తమకు మేలు చేకూర్చే పనులను ప్రారంభించేలా హడావిడి చేస్తున్నారు. కొన్ని దశాబ్దాల పాటు ప్రభుత్వ అధీనంలో ఉన్న దస్పల్లా భూములను భయపెట్టి వైసీపీ పెద్దలు కాజేసారని విపక్షాలు పెద్ద ఎత్తున ఆరోపిస్తున్నాయి. ఇప్పుడు ఇదే భూముల్లో 22 అంతస్తుల భారీ భవన నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. అందుకోసం సర్క్యూట్ హౌస్ ముందు నుంచి నేవీ హౌస్ మీదుగా గ్యాస్ గోడౌన్ వరకు ఉన్న 40 అడుగుల రహదారిని 100 అడుగులు చేయడానికి పూనుకొంటున్నారు. తాజాగా జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో విపక్షాలు వ్యతిరేకించినప్పటికీ, తీవ్ర గందరగోళం మధ్య అధికార వైసీపీ పాలకవర్గం ఆమోదించింది. ఈ రహదారి విస్తరణకు రూ.4.64 కోట్లు కేటాయించారు. ఈ రహదారిలో గ్యాస్ గోడౌన్ ఎదురుగా ఉన్న నాల్కో గెస్ట్ హౌస్ పక్కనే ఉన్న అపార్టుమెంట్‌ను కూడా తొలగిస్తామని అధికారులు అంటున్నారు. ఈ రహదారిలో ట్రాఫిక్ రద్దీ అసలు లేకపోయినా వైసీపీ నేతలు చేపట్టే భారీ ప్రాజెక్టు కోసమే రహదారిని విస్తరిస్తున్నారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇక నగరంలో 20 రహదారులు, కూడళ్లను అభివృద్ధి చేయడానికి రూ160 కోట్లతో మేయర్ ముందస్తు అనుమతి ఇచ్చారు. అయితే వైసీపీ నేతల ప్రాజెక్టులకే ముందు వరుసలో కేటాయింపులు చేశారు. విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు చెందిన ఎంకే బిల్డర్స్ నిర్మిస్తున్న వెంచర్ల వైపు రూ.11.50 కోట్లతో నాలుగు రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారని విపక్ష కార్పొరేటర్లు ఆరోపించారు. మరోవైపు, ఎమ్మెల్యే వాసుపల్లికి చెందిన నరవలో ఉన్న మూడు ఎకరాల నిర్మానుష్యంగా ఉండే ఖాళీ స్థలానికి రూ.1.96 కోట్లతో రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారని, అలాగే, వైసీపీ ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త కె.కె.రాజుకు చెందిన వెంచర్‌కు రూ.1.44 కోట్లతో రహదారి నిర్మాణం, సీఎం జగన్ బంధువుకు చెందిన మధురవాడలోని లా కళాశాల రోడ్డులో విల్లాసం లేఔట్‌కు రూ.4.5 కోట్లతో రహదారి నిర్మాణానికి జీవీఎంసీ వైసీపీ పాలకవర్గం అనుమతులిస్తూ, అధికారులతో వారికి సకల సౌకర్యాలు కల్పిస్తున్నారని విపక్ష కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. ఇటీవల పరదేశి పాలెంలో మంత్రి ధర్మాన ప్రసాదరావుకు చెందిన భూమికి రూ.4 కోట్లతో రహదారి నిర్మించడం అన్యాయమని అంటున్నారు. నగరంలో కైలాసపురంలో రహేజా కంపెనీ ఇనార్బిట్ మాల్ నిర్మాణానికి విశాఖపట్నం నుంచి 17 ఎకరాలు దీర్ఘకాలిక లీజుకు పొందారు. ఈ లీజు ఇప్పించడంలో ఓ వైసీపీ నేత భారీగా ముడుపులు అందుకున్నారని పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. మాల్ నిర్మాణానికి పోర్ట్ ఆస్పత్రి నుంచి 200 అడుగుల వెడల్పు రహదారిని విస్తరించారు. ఈ మాల్ శంకుస్థాపనకు సాక్షాత్తు సీఎం జగన్ రావడం విశేషం. దీనికి ఏర్పాట్లన్నీ రాష్ట్ర ప్రభుత్వమే చేసింది. సీతమ్మధార అల్లూరి సీతారామరాజు విగ్రహం నుంచి ఎన్‌ఏడీ సమీపంలో ఉన్న మారియట్ హోటల్ వరకు 8 కిలోమీటర్ల మేర ఉన్న 60 అడుగుల నుంచి 80 అడుగుల రహదారి విస్తరణ పనులకు విశాఖపట్నం పోర్టు సామాజిక బాధ్యతల నిధుల నుంచి రూ.34.75 కోట్లు కేటాయించడం ఆశ్చర్యకరమైన విషయంగా ప్రజలు చెప్పుకుంటున్నారు. పాత నగరంలో విశాఖపట్నం పోర్టు ద్వారా అనేక రహదారులు గోతులమైనప్పటికీ ఏ రోడ్డు నిర్మాణానికి ముందుకు రాని విశాఖ పోర్టు, ఇంత పెద్ద రోడ్డు విస్తరణకు ముందుకు రావడం వెనుక ఓ వైసీపీ నేత ఒత్తిడిలే కారణమని ప్రచారం సాగుతోంది. ఈ రహదారిలో కూడా ట్రాఫిక్ ఏమాత్రం ఉండదు. విస్తరించాల్సిన అవసరం కూడా లేదు. కానీ రహేజా మాల్ యాజమాన్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం తమ భక్తిని చాటుకునేందుకే రోడ్లు నిర్మిస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇలా వైసీపీ నేతలు తమ ఆస్తుల విలువను పెంచుకునేందుకు వారికి ప్రజాధనంతో మౌలిక సదుపాయాల కల్పనకు వీఎంఆర్డీఏ, జీవీఎంసీతో పాటు అనేక సంస్థలు పని చేస్తున్నాయని, పన్నులు చెల్లిస్తున్న ప్రజలకు సరైన మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. విశాఖ నగరంలో అనేక వీధుల రోడ్లు గతుకులమయంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా రోడ్లు నిర్మించని అధికారులు, నేతల సిఫార్సు చేసిన రహదారులను ఆగమేఘాల మీద నిర్మించడంపై విశాఖ ప్రజలు మండిపడుతున్నారు. వీఎంఆర్డీఏ మాస్టర్ ప్లాన్ రహదారులు అర్ధాంతరంగా పూర్తికాకుండా ఆగిపోయాయి. మధురవాడ ప్రాంతంలో 10 మాస్టర్ ప్లాన్ రహదారులు నేటికీ పూర్తికాలేదు. ప్రజా అవసరాలకు ఉపయోగపడే రహదారులను విస్తరించకుండా, నిర్మించకుండా కేవలం వైసీపీ నేతల ఆస్తులు చుట్టే రోడ్లు నిర్మించడంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

'అచీవర్' ఏపీ

- కేంద్ర ప్రభుత్వ సూచికలో టాప్!
- సరకు రవాణా రంగంలో అద్భుత పనితీరు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: సరకు రవాణా రంగంలో అద్భుత పనితీరుతో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ముందుభాగంలో నిలిచింది. లాజిస్టిక్స్ ఇండెక్స్ చార్ట్ 2023లో అచీవర్‌గా ఆంధ్రప్రదేశ్ అవతరించింది. సరకు రవాణాలో దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పనితీరుపై రూపొందించిన లాజిస్టిక్స్ ఇండెక్స్ చార్ట్–2023ను కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ తాజాగా విడుదల చేసింది. ఈ ఇండెక్స్‌లో 13 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను అచీవర్‌లుగా వర్గీకరించింది. ఇందులో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా నిలవడం విశేషం. ఏపీతోపాటు కర్నాటక, తమిళనాడు, చండీగఢ్, గుజరాత్ తదితర రాష్ట్రాలు ఈ జాబితాలో ఉన్నాయి. ఎగుమతులు, ఆర్థిక వృద్ధికి అవసరమైన లాజిస్టికల్ సేవల్లో ఆయా రాష్ట్రాల సామర్థ్యాన్ని ఈ సూచిక తెలియజేస్తోంది. అదేవిధంగా లాజిస్టిక్స్ ఇండెక్స్ చార్ట్‌లో అచీవర్స్ తర్వాత ఫాస్ట్ మూవర్స్ కేటగిరిలో కేరళ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్ రాష్ట్రాలు నిలిచాయి. గోవా, ఒడిశా, పశ్చిమ బెంగాల్, బీహార్, చత్తీస్‌గఢ్, హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాలు ఆస్పైరర్స్ కేటగిరీలో ఉన్నాయి. రాష్ట్రాల్లో సరకు రవాణా సేవలకు కల్పిస్తున్న అనుకూల పరిస్థితుల ఆధారంగా కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ ఈ ర్యాంకింగ్‌లు ఇచ్చింది.

సీజేఐ మినహాయింపు అప్రజాస్వామికం

లక్ష్మణరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ప్రధాన ఎన్నికల కమిషనర్‌తో పాటు ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకం బిల్లు–2023ను రాజ్యసభలో ఆమోదానికి బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించటం అప్రజాస్వామికమని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన సెర్చ్ కమిటీలో ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడు, భారత ప్రధాన న్యాయమూర్తి ఉండేవారని, ప్రస్తుతం సీజేఐ స్థానంలో అధికార పార్టీకి చెందిన మంత్రి ఉండే విధంగా మార్పులు చేయటం ద్వారా ఎన్నికల కమిషన్ తన తటస్థ స్వభావాన్ని కోల్పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తాజా చర్య వల్ల ఎన్నికల కమిషన్‌కు గల కొంత వరకైనా తటస్థత అవశేషాలు కోల్పోతుందన్నారు.

ఎంపిక విధానంలో ఇప్పటివరకు ఉన్న చిన్న చెక్ అండ్ బ్యాలెన్స్ కూడా ఇప్పుడు రద్దు అవుతుందని, ఇది ప్రజాస్వామ్య మూలాధార సూత్రాలను ఉల్లంఘించడమే గాక దేశంలో ఫాసిస్ట్ నిరంకుశ పాలనను బలోపేతం చేస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి దుర్మార్గపు చర్యకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యవాదులంతా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ఫాసిస్ట్ బిల్లు రద్దు కోసం బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి చేయడానికి దేశవ్యాప్తంగా శక్తివంతమైన ప్రజా ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందని లక్ష్మణరెడ్డి పేర్కొన్నారు.

జగన్‌కు గుణపాఠం తప్పదు

- అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి
- ఈశ్వరయ్య డిమాండ్

విశాలాంధ్ర- మార్కాపురం: డిమాండ్ల సాధన కోసం సమ్మెకు దిగిన అంగన్వాడీలపై ప్రభుత్వం కక్షసాధింపు, బెదిరింపులకు దిగడం దారుణమని, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య విమర్శించారు. సమ్మెపై జగన్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని, మంత్రులు, ఎమ్మెల్యేలు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని ఆగ్రహవ వెలిబుచ్చారు. అంగన్వాడీలకు జగన్ ఇచ్చిన హామీను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమ్మెతో ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 54 వేలకు పైబడి అంగన్వాడీ కేంద్రాలు మూతపడ్డాయని చెప్పారు. ప్రకాశం జిల్లా మార్కాపురంలో సమ్మెకు దిగిన అంగన్వాడీలకు ఈశ్వరయ్య సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ చరిత్ర నుండి పాఠాలు నేర్చుకోకపోతే వైసీపీ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. అంగన్వాడీల సమ్మెకు సీపీఐ అండగా ఉంటుందని ప్రకటించారు. వినతిపత్రం ఇవ్వడానికి ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి దగ్గరకు అంగన్వాడీలు వెళితే పెళ్లికార్డు ఇవ్వడానికి వచ్చారా అంటూ వ్యంగ్యంగా మాట్లాడటం... వాళ్లను అవమానించడమేనని ఈశ్వరయ్య ఆరోపించారు. అంగన్వాడీలు మదమెక్కి సమ్మె చేస్తున్నారంటూ బొబ్బిలి ఎమ్మెల్యే మాట్లాడటం సరికాదన్నారు. అధికారం ఉన్నది కదా అని అహంకారంతో అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగలకొట్టి భయభ్రాంతులకు గురిచేస్తే సమస్యలు పరిష్కారం కావన్నారు. అంగన్వాడీలకు, సచివాలయ ఉద్యోగులకు, వలంటీర్లకు పోలుసులకు మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మానుకోవాలని హితవు పలికారు. చర్చల పేరుతో పిలిచి అంగన్వాడీ సంఘాల నాయకులను ప్రభుత్వం అవమానించడంపై మండిపడ్డారు. వేతనాలు పెంచబోమని మంత్రులు చెప్పడం చూస్తుంటే అంగన్వాడీలను వైసీపీ ప్రభుత్వం మోసం చేస్తున్నట్లు కనిపిస్తోందన్నారు. అంగన్వాడీల విషయంలో జగన్ మాట తప్పాడు...మడమ తిప్పాడని విమర్శించారు. ఇదే వైఖరి కొనసాగిస్తే రానున్న ఎన్నికల్లో ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని చూసుకోకతప్పదని ఈశ్వరయ్య హెచ్చరించారు. ఒకవైపు అంగన్వాడీల సమ్మె జరుగుతున్న దని, మరోవైపు మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు ఈ నెల 27న సమ్మె సైరన్ మోగించారని, ఆశా కార్యకర్తలు, పంచాయతీ కార్మికులు, చిరు స్థాయి ఉద్యోగులు, కార్మికులు జగన్ ప్రభుత్వంపై తిరుగుబాటు ప్రారంభించారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం కూలడం ఖాయమన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, నియోజకవర్గ కార్యదర్శి అందె నాసరయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే ఖాసిం పాల్గొన్నారు.

21న ఆశా వర్కర్ల రాష్ట్ర సదస్సు

ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి

విశాలాంధ్ర- విజయవాడ(చిట్టినగర్): రాష్ట్రంలోని ఆశావర్కర్లకు కనీస వేతనం ఇచ్చి, వైద్య ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ ఈనెల 21న విజయవాడలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆంధ్ర ప్రదేశ్ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్.శాంతి పిలుపునిచ్చారు. సదస్సును జయప్రదం చేయాలని ఆమె కోరారు. ఏఐటీయూసీ అనుబంధ ఆంధ్ర ప్రదేశ్ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ అధ్వర్యంలో దాసరి భవన్ వద్ద విలేకరుల సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్.శాంతి, ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్.వెంకటసుబ్బయ్య పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ దేశంలో 10 లక్షల మంది ఆశా వర్కర్లు వైద్యరంగంలో కుటుంబ ఆరోగ్య సంక్షేమం కోసం కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. మన రాష్ట్రంలో 55,400 మంది ఉన్నారని తెలిపారు. ఆశా వర్కర్లు మాతా, శిశు సంరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్‌ఆర్‌హెచ్‌ఎం పథకం కింద చేపట్టిన అన్ని ప్రభుత్వ కార్యక్రమాలు, అన్నిరకాల సర్వేలు నిర్వహిస్తున్నారని వివరించారు. ప్రజలకు మంచి సేవలు అందించి, వారిని వ్యాధుల బారినుంచి కాపాడటంలో ముందున్నారని తెలిపారు. ఒక స్త్రీ గర్భవతి అయిన తేదీ నుంచి ఆమె శిశువుకు జన్మనిచ్చేంత వరకు సేవలు అందిస్తూనే, బాలింతకు వ్యాధులు రాకుండా వ్యాక్సినేషన్ చేయించడం, వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం, రక్తహీనత, రక్తపోటు రాకుండా మంచి ఆహారం తినాలని జాగ్రత్తలు చెబుతూ కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వానికి ఆశాలపై ఎందుకు కనికరం లేదని ఆయన ప్రశ్నించారు. పనికి తగ్గ ఫలితం కావాలని, ప్రతి ఆశా వర్కర్ కు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, వైద్య ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈనెల 21న జరగబోయే విజయవాడలో రాష్ట్ర సదస్సులో ప్రతి ఆశా కార్యకర్త పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర నాయకురాలు కళ్లేపల్లి శైలజ, ఆశా వర్కర్స్ యూనియన్ కడప జిల్లా గౌరవ అధ్యక్షులు జి.వేణుగోపాల్ పాల్గొన్నారు.

బాబుది గ్రాఫిక్స్ పాలన: విజయసాయి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జగన్ పాలనలో చంద్రబాబులా గ్రాఫిక్స్ ఉండబోవని, వైసీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి వ్యాఖ్యానించారు. రూ.85 కోట్లతో పలాసలో నిర్మించిన డాక్టర్ వైఎస్ఆర్ కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభించిన సందర్భంగా ఆయన శనివారం సామాజిక మాధ్యమంలో ఒక ప్రకటన చేశారు. మూత్రపిండాల సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని చూపిస్తూ రూ.700 కోట్లతో నిర్మించిన వైఎస్సార్ సుజలధార ప్రాజెక్టును కంచిలి మండలం మార్కాపురంలో సీఎం జగన్ ప్రారంభిస్తే, చంద్రబాబు హయాంలో అన్ని గ్రాఫిక్స్ తప్ప ఏమీ లేదని విమర్శించారు. ప్రజారోగ్య పరిరక్షణలో మరో విప్లవాత్మక నిర్ణయానికి రాష్ట్ర కేబినెట్ ఆమోదం లభించిందన్నారు. అపర సంజీవిని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఉచిత వైద్య పరిమితి రూ.25 లక్షలకు పెంచుతూ ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ వైద్య కళాశాలలో కార్పొరేట్ వైద్యాన్ని అందించడంతో పాటు, ప్రైవేట్ ఆసుపత్రిలోనూ అధునాతన వైద్య సేవలు పొందేలా ఆరోగ్యశ్రీ పథకాన్ని వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తోందని విజయసాయి రెడ్డి పేర్కొన్నారు.

శాంతిభద్రతల విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన

పోలీసులకు డీజీపీ డిస్క్ అవార్డులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా 2022లో క్షేత్రస్థాయిలో శాంతిభద్రతల విభాగంతో పాటు దిశ, కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎస్పీలు, డీఐజీలు, ఐజీలు, అడిషనల్ డీజీలను గుర్తించి... వారు అందించిన సేవల అర్హత ఆధారంగా 65 మందికి డీజీపీ డిస్క్ అవార్డులను, పతకాలను శనివారం మంగళగిరి పోలీస్ ప్రధాన కార్యాలయంలో డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి ప్రదానం చేశారు. మొత్తం 15 మంది ఎస్పీలు గోల్డ్ మెడల్, 56 మంది కానిస్టేబుల్ నుండి ఐపీఎస్‌లు సిల్వర్ మెడల్స్, ఐదుగురు డీఎస్పీలు, ఏఎస్ఐలకు బ్రాంజి మెడల్స్‌ను డీజీపీ అందజేశారు. డీజీపీ మాట్లాడుతూ కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్ విధానాన్ని గత సంవత్సరం జూన్ నుండి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నామని, ఈ విధానం ద్వారా ప్రతి ఒక్క యూనిట్ అధికారి సీపీ/ఎస్పీ తమ పరిధిలోని అత్యంత ముఖ్యమైన ఐదు/ఆరు కేసులు తమ పర్యవేక్షణలో ప్రతిరోజు షెడ్యూల్ మేరకు కోర్టులో జరుగుతున్న కేసు విచారణ పురోగతిపై సమీక్ష నిర్వహించే విధంగా వ్యవస్థలో మార్పులు తెచ్చామన్నారు. దీనిద్వారా ఈ ఏడాది తీవ్రమైన నేరాల నమోదు శాతంలో గణనీయంగా అదుపు చేయగలిగామన్నారు. కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్ విధానంతో నేరాల తీవ్రత ఆధారంగా గతేడాది గుర్తించిన 165 కేసుల్లో న్యాయస్థానాలలో విచారణ ప్రక్రియ పూర్తి చేసుకొని 100 శాతం నిందితులకు కోర్టులు శిక్షలు విధించాయన్నారు. పోలీస్ శాఖలోని వివిధ విభాగాలైన అవినీతి నిరోధక శాఖ, సీఐడీ, గ్రేహౌండ్స్, ఆక్టోపస్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్, ఇంటెలిజెన్స్, ఏపీఎస్‌పీ బెటాలియన్స్, స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో(ఎస్ఈబీ) విభాగాలలోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బంది వివరాలు సేకరిస్తున్నామన్నారు. త్వరలోనే వారికి డీజీపీ డిస్క్ అవార్డులు అందజేస్తామన్నారు. క్షేత్రస్థాయిలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్న సిబ్బందికి ప్రోత్సాహకరంగా ఈ అవార్డులు అందిస్తున్నామని రాజేంద్రనాథ్ రెడ్డి చెప్పారు.

చెవులు కోసి వృద్ధ మహిళ దారుణ హత్య

విశాలాంధ్ర-పూసపాటిరేగ: వృద్ధ మహిళ దారుణంగా హత్య గురైంది. ఈ ఘటన విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం కొండ గుడ్డి జరిగింది. మహంతి రాజమ్మ(65) అనే వృద్ధురాలు రోజు ఆవులు కాస్తూ ఉండేది. ఈ మహిళ భర్త పేరు లక్ష్మణ. కాగా, శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో రోజులాగే ఆవులు తోలుకొని వెళ్లిన రాజమ్మ సాయంకాలం చీకటి పడినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకడం ప్రారంభించారు. శనివారం ఉదయం మామిడి తోటలో హత్యకు గురై ఉన్నట్లు గుర్తించారు. వెంటనే స్థానిక సబ్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ మృతదేహాన్ని పరిశీలించి ఎడమ భుజంపై కత్తిగాటు, కుడి పక్కటెముకల మీద కత్తిపోటుతోపాటు రెండు చెవులను కోసి చంపారని వెల్లడించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషి

భోగాపురం విమానాశ్రయం పనులు పరిశీలించిన మంత్రులు, వైసీపీ నేతలు

విశాలాంధ్ర విజయనగరం: శంకుస్థాపనలు తప్ప పనులు జరగడం లేదని విమర్శించే వారికి వేగంగా సాగుతున్న భోగాపురం విమానాశ్రయం పనులే సమాధానం చెబుతాయని రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని చెప్పారు. వైసీపీ ఉత్తరాంధ్ర కన్వీనర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బూడి ముత్యాలనాయుడుతో కలిసి శనివారం భోగాపురం విమానాశ్రయం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో మంత్రి అమర్నాథ్ మాట్లాడుతూ ఈ ఏడాది మే 3న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి భోగాపురం విమానాశ్రయం పనులకు శంకుస్థాపన చేశారని అన్నారు. అప్పటి నుంచి జీఎంఆర్ సంస్థ పనులు చేపట్టిందని, ఎల్‌అండ్‌టీతో ఒప్పందంతో విమానాశ్రయ పనులు త్వరితగతిన జరుగుతున్నాయని తెలిపారు. విమానాశ్రయానికి సంబంధించి 3.8 కిమీ రన్ వే, అప్రోచ్ రోడ్ల పనులు జరుగుతున్నాయని చెప్పారు. మూలపేట పోర్ట్, రామయ్యపట్నం పోర్ట్, బందరు పోర్ట్, ఉద్దానం కిడ్నీ రీసెర్చ్ సెంటర్, విజయనగరం, పాడేరులో వైద్య కళాశాలలు, పార్వతీపురంలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటవుతున్నాయని వివరించారు. ఇవన్నీ ప్రతిపక్షాలకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రూ.4,750 కోట్లతో భోగాపురం విమానాశ్రయం టెర్మినల్ భవనం, రన్ వే పనులు జరుగుతున్నాయని చెప్పారు. బెంగళూరు ఇంటర్నేషనల్ స్కూల్ విశాఖపట్టణంలో ఏర్పాటవుతుందన్నారు. వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ భోగాపురం విమానాశ్రయం ప్రభుత్వ చిత్తశుద్ధి అద్దం పడుతుందన్నారు. గత ప్రభుత్వం ఉత్తరాంధ్రకు ద్రోహం చేసిందని ఆరోపించారు. భోగాపురం రైతులు, ప్రజలు లబ్ధి పొందాలన్నదే ప్రభుత్వ ఆకాంక్షన్నారు. 2025 నాటికి విమానాశ్రయం పూర్తి కావాలని జగన్ కోరారన్నారు. ఈ విమానాశ్రయం వల్ల 10 వేల మందికి ఉపాధి కలుగుతుందన్నారు. విశాఖను పరిపాలనా రాజధానిగా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. తొలుత జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఉత్తరాంధ్ర అభివృద్ధి కి కట్టుబడి ఉన్నారని తెలిపారు. భోగాపురం విమానాశ్రయం నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పూర్తి చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, మంత్రి ధర్మాన కృష్ణదాసు, ఎంపీలు బెల్లాన చంద్రశేఖర్, సత్యనారాయణ, ఎమ్మెల్యేలు బడ్డుకొండ, అలజంగి జోగారావు, వైసీపీ నాయకులు శోభ హైమవతి, అవనాపు విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

12న విద్యార్థి సంఘాల చలో పార్లమెంట్

- ఏపీపై కేంద్రం కక్షపూరిత వైఖరి
- ఏఐఎస్ఎఫ్ నాయకుడు సాయికుమార్

విశాలాంధ్ర-విజయవాడ: నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్, వామపక్ష విద్యార్థి సంఘాల అధ్వర్యంలో జనవరి 12న చలో పార్లమెంట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యుడు మందగళ్ల సాయికుమార్ తెలిపారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సమావేశాలు రెండు రోజుల పాటు ముంబైలోని భూపేష్ గుప్త భవన్‌లో జరుగుతున్నాయి. శనివారం ప్రారంభమైన ఈ సమావేశాలకు ఆంధ్ర ప్రదేశ్ నుంచి సాయికుమార్, వలరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ విభజన హామీ చట్టం ప్రకారం ఆంధ్ర ప్రదేశ్‌కు విద్యాసంస్థలను కేటాయించకుండా బీజేపీ ప్రభుత్వం రాష్ట్రం పట్ల కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై, ఏఐఎస్ఎఫ్ భవిష్యత్ విద్యార్థి ఉద్యమంపై చర్చించినట్లు తెలిపారు. బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యావిధానం-2020 పూర్తిగా విద్యా విధానాన్ని నిర్వీర్యం చేసేలా, విద్యను కాషాయీకరణ చేసే విధంగా ఉందన్నారు. అలాగే ఏపీ ప్రభుత్వం 84, 85,117 జీవోలను తీసుకొని వచ్చి ప్రాథమిక విద్యకు ఉరి బిగించిందని, దీనివల్ల రాష్ట్రంలో 2,500 పాఠశాలలు మూతపడ్డాయని తెలిపారు. దేశంలో విద్యార్థుల డ్రాపవుట్ జాబితాలో ఆంధ్ర ప్రదేశ్ ప్రథమ స్థానంలో ఉందన్నారు. అలాగే వైద్య విద్యను అమ్మకానికి పెట్టిందని తెలిపారు. పాలకుల చర్యలు విశ్వవిద్యాలయాల మౌలిక విలువలను మంటగలుపుతున్నాయని అన్నారు. విశ్వవిద్యాలయాల్లో విగ్రహాలు పెట్టడం, పేర్లు మార్చడం, మెగా డీఎస్సీని ప్రకటించకపోవటం, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాలకు నిధులు కేటాయించకపోవడం అనేక అంశాల ద్వారా విద్యావ్యవస్థ ఆంధ్ర రాష్ట్రంలో ఛిద్రమైందని విమర్శించారు. అందువల్ల కేంద్రంలోని బీజేపీ, ఏపీలో వైసీపీ ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందని అన్నారు.

ప్రజలు కేంద్ర పథకాలు వినియోగించుకోవాలి

కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి దేవ్‌సింహ్ చౌహాన్



విశాలాంధ్ర-కోడుమూరు: ప్రజలు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి దేవ్‌సింహ్ చౌహాన్ కోరారు. కర్నూలు జిల్లా కోడుమూరు మండల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వంద శాతం లబ్ధిదారులకు అందించాలనే లక్ష్యంతో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను నవంబరు 25 నుంచి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులై సంక్షేమ పథకాలు లబ్ధి పొందని వారు ఉండకూడదనేది కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. వీటి అమలుకు రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందించాలన్నారు. జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ కేంద్ర సంక్షేమ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరిని నమోదు చేయడానికి వికసిత్ భారత్ సంకల్ప యాత్రను కర్నూలు జిల్లాలో 484 గ్రామ పంచాయతీలలో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 149 పంచాయతీలలో అర్హులను గుర్తించి సంక్షేమ పథకాల లబ్ధిని అందజేశామన్నారు. 17 రకాల ప్రధాన సంక్షేమ పథకాల అమలు ప్రక్రియను వికసిత్ భారత్ సంకల్పయాత్ర ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. కోడుమూరు వివిధ సంక్షేమ పథకాల శాఖల స్టాల్స్ ఏర్పాటు చేశామని, అర్హత ఉండి లబ్ధి పొందని వారు వాటిలో నమోదు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ కోరారు. తొలుత గ్రామీణ తపాలా జీవిత బీమా స్టాల్, వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య పరీక్షల స్టాల్, ఐసీడీఎస్ పోషణ అభియాన్ స్టాల్‌తో పాటు వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను కేంద్ర మంత్రి పరిశీలించారు. అనంతరం వికసిత భారత్ సంకల్ప యాత్ర వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. అర్హులైన 607 స్వయం సహాయక సంఘాల సభ్యులకు 3 కోట్ల 3 లక్ష రూపాయల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వర రెడ్డి, జిల్లా పరిషత్ సీఈఓ నాసర్ రెడ్డి, కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్, సీపీవో హిమాప్రభాకర్ రాజు, డీపీవో నాగరాజు నాయుడు, బీజేపీ నాయకులు నీలకంఠం, డా.పార్థసారథి, విరుష రెడ్డి, ఎంపీపీ రుతమ్మ, ఖాదీ బోర్డు మాజీ చైర్మన్ చంద్రమౌళి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కేఎల్‌యూ విద్యార్థుల అద్భుత ప్రతిభ

ఆకట్టుకున్న టెక్ ఎక్స్‌పో ప్రదర్శన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో మొదటి సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థులు రూపొందించిన నూతన ఆవిష్కరణలను ప్రదర్శించారు. ఈ టెక్ ఎక్స్‌పోకు అధ్యాపకులు , విద్యార్థుల నుంచి విశేష ఆదరణ లభించింది. డ్రైవర్ లేకుండా నడిచే కారు, ఆటోమేటిక్‌గా ఓపెన్ అయ్యే డోర్, ఎదురుగా ఉన్న వాహనాన్ని గుర్తించి తన వేగాన్ని స్వయంగా నియంత్రించుకునే కారు...ఇలా అనేక ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎఫ్ఈడీ డైరెక్టర్ డాక్టర్ ఎ.జగదీశ్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులు రూపొందించిన నూతన ఆవిష్కరణలు అందరినీ ఆలోచింపజేస్తున్నాయన్నారు. విద్యార్థుల వినూత్న ఆలోచనలతో రానున్న కాలంలో టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కనుందనే సంకేతాలు ఇవ్వడమే కాకుండా వాటిని నేరుగా తయారుచేసి చూపారని ప్రశంసించారు. ఇంజినీరింగ్‌లోకి అడుగు పెట్టిన మొదటి సంవత్సరంలోనే ఆటోమేటిక్ యంత్రాలు రూపొందించడం అభినందనీయమన్నారు. రాడార్ టెక్నాలజీని, మెటల్ డిటెక్టర్‌ను అనుసంధానం చేసి దూరంగా ఉన్న వస్తువులు, ఏ దిక్కున ఉన్నాయో కూడా గుర్తించగలిగే పరికరాలతో పాటు మనుషులు దగ్గరకు రాగానే తలుపులు తెరుచుకునే యంత్రం, మనిషి ఎన్నివేళ్లు చూపుతున్నాడో లెక్కించి చెప్పగలిగే రోబో టెక్నాలజీని రూపొందించి విద్యార్థులు అత్యాధునిక టెక్నాలజీకి శ్రీకారం చుట్టారని అభినందించారు. ఎఫ్ఈడీ డిప్యూటీ కో ఆర్డినేటర్ డాక్టర్ సోమ్‌లాల్ మాట్లాడుతూ మొదటి సంవత్సరంలో టెక్నాలజీ పట్ల అభిరుచి పెంచుకున్న తమ విద్యార్థులు రానున్న మూడేళ్లలో మరిన్ని విజయాలు సొంతం చేసుకుంటారని ప్రశంసించారు. కేఎల్ వర్సిటీలో ఉన్న అత్యాధునిక లాబోరేటరీల వల్ల విద్యార్థులు టెక్నాలజీలో మరింత లోతుగా పరిశోధన చేయడానికి అవకాశాలు పెరిగాయని అన్నారు. అత్యాధునిక టెక్నాలజీని రూపొందించడంలో అత్యంత ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్‌చాన్సలర్లు డాక్టర్ జి.పార్థసారథివర్మ, డాక్టర్ వీవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, కో ఆర్డినేటర్లు డాక్టర్ శివగంగప్రసాద్, డాక్టర్ బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఒంటరిగా పోటీ చేస్తారా?

చంద్రబాబుకు అంబటి రాంబాబు సవాల్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గుంపుగా కాదు ఒంటరిగా పోటీ చేసి... గెలవాలని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు మంత్రి అంబటి రాంబాబు సవాల్ విసిరారు. 175 నియోజకవర్గాల్లో ఒంటరిగా పోటీ చేసే దమ్ముందా? అని ప్రశ్నించారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి అంబటి మాట్లాడుతూ, జనసేనతో పొత్తు ఎందుకో చంద్రబాబు సమాధానం చెప్పాలన్నారు. చంద్రబాబుకు మతి, గతి తప్పినట్లు వ్యాఖ్యానించారు. సీఎంపైనా, ప్రభుత్వంపైనా పిచ్చి విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. 'చంద్రగిరి నుంచి కుప్పంకు నువ్వెందుకు పారిపోయావ్? లోకేశ్ మంగళ గిరిలో, బాలకృష్ణ హిందూపురంలోనే ఎందుకు పోటీ చేయాలి? అని అంబటి ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో మిమ్మల్ని చిత్తు చేయడమే మా లక్ష్యమని ఉద్ఘాటించారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన పార్టీలకు ఉనికి ఉండబోదన్నారు.

సంపాదకీయం

కేరళ ప్రభుత్వంపై కేంద్రం అక్కసు

దేశ రాజకీయాలలో కేరళకు ప్రత్యేకత ఉంది. ఆ రాష్ట్ర రాజకీయాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయి. కేరళ పేరు వింటేనే దేశ ప్రజలలో చైతన్యం రగులుతుంది. విద్వేష, కుళ్లు రాజకీయాలకు అక్కడి రాజకీయనేతలు దూరం. సమస్యలపైనే అక్కడ పోరాటాలు. ముఖ్యమంత్రి, ప్రతిపక్షనేత, రాష్ట్రమంత్రులు సైతం ఒకే వేదికపై నుంచి నిరసన తెలియచేశారంటే ఆ రాష్ట్రానికీ, ఆ రాష్ట్ర రాజకీయానికే చెల్లింది. అక్కడి వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (ఎల్డీఎఫ్)లోని ప్రధాన భాగస్వాములు సీపీఎం, సీపీఐ అనుసరిస్తున్న విధానాలు రాజకీయ విలువలను ద్విగుణీకృతం చేస్తున్నాయి. ప్రపంచ రాజకీయ చరిత్రలో కేరళకు ప్రాధాన్యత కల్పిస్తున్నాయి. 2011లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ మతపరమైన మైనారిటీల మద్దతుతో 140 మంది సభ్యుల రాష్ట్ర అసెంబ్లీలో ఎల్డీఎఫ్ కంటే స్వల్ప మెజారిటీ సాధించింది. ఆ ఎన్నికలలో యూడీఎఫ్ 72 సీట్లు గెలుచుకుని సాధారణ మెజారిటీ కంటే కేవలం ఒక స్థానం మాత్రమే ఎక్కువ పొందింది. ఎల్డీఎఫ్ 68 సీట్లు గెలుచుకుంది. అధికార, ప్రతిపక్ష కూటముల మధ్య తేడా కేవలం నాలుగుసీట్లే అయినప్పటికీ అప్పట్లో మోదీ, అమిత్ షా వంటి దుష్టద్వయం లేకపోవడం, విలువలతో కూడిన వామపక్షాల రాజకీయం, ప్రజాస్వామ్యంపై విశ్వాసం, ప్రజా తీర్పును గౌరవించేధోరణి, అధికారం కోసం పాకులాట లేకపోవడం వంటి లక్షణాలతో యూడీఎఫ్ ప్రభుత్వం ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా పూర్తికాలం అధికారంలో సాగింది. ఇతరపార్టీల అసంతృప్త సభ్యులను ఉపయోగించుకుని మెజారిటీ సాధించేందుకు ప్రయత్నించబోమని, ప్రతిపక్షంలో కూర్చుంటామని పదవీ విరమణ చేస్తున్న అప్పటి ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్ చేసిన ప్రకటన కేరళ రాజకీయ ప్రత్యేకతకు నిదర్శనం. ఎల్డీఎఫ్ నాయకత్వానికి ఎన్నికల వరకే రాజకీయం. ఆ తరవాత ప్రజాభ్యుదయమే ప్రధాన అజెండా. అన్ని విషయాల్లోనూ వీలైనంత వరకు ప్రతిపక్షాన్ని కలుపుకుపోతోంది. అన్ని అంశాలపైనా తరుచూ ప్రధాన ప్రతిపక్షంతో చర్చించడం, అఖిలపక్ష సమావేశాలలో నిర్ణయాలు తీసుకోవడం ద్వారా ముందుకు సాగుతోంది. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, పేదరికంలో మగ్గుతున్న వారి ఆర్థికాభివృద్ధికి ఎల్డీఎఫ్ ప్రభుత్వం అనేక నిర్మాణాత్మక చర్యలు తీసుకుంటోంది. ఎల్డీఎఫ్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా 2022 జూన్ 9నాటికి గత ఆరేళ్లలో 2,34,567 భూపట్టాలు పంపిణీ చేసింది. రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత మొదటివార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రాష్ట్రంలో 15 వేల భూపట్టాలు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది. అయితే ఈ సమయంలో రెవెన్యూ శాఖ రెట్టింపు లక్ష్యాన్ని అధిగమించి 41,021 భూమి హక్కుపత్రాలు పంపిణీ చేసింది. మొత్తం ఏడాది వ్యవధిలో 54,535 భూపట్టాలు జారీ అయ్యాయి. ఇందులో ఎలాంటి రికార్డులు లేని వ్యవసాయ భూమి కలిగి ఉన్న వారూ ఉన్నారు. నిరుపేదలకు ఆరేళ్లలో ప్రభుత్వం 2,96,008 ఇళ్లు అందించింది. రాష్ట్రంలో తొలి సారిగా అమలు చేసిన డిజిటల్ సర్వే వల్ల భూపంపిణీ సులువైంది. తల దాచుకునేందుకు చోటులేని వారికి ఇల్లు ఎప్పుడూ కలగానే ఉంటుంది. అలాంటివారి కల నిజం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రకృతి వైపరీత్యాలు, జీవిత కష్టాలు భరించే వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం సురక్షిత గృహాలు సిద్ధం చేస్తోంది. లైఫ్ మిషన్ ద్వారా ప్రభుత్వం సెప్టెంబర్ 30, 2023 నాటికి 3,54,712 కుటుంబాలకు ఆశ్రయం కల్పించింది. అదనంగా 1,20,579 వ్యక్తిగత గృహాల నిర్మాణం పురోగతిలో ఉంది. ఒకే రాష్ట్రంలో మూడు లక్షల ఇళ్లు పేదల కోసం సిద్ధం చేయడం ప్రపంచంలోనే బహుశా ఇదే ప్రథమం. ఈ విధంగా అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న ఎల్డీఎఫ్ ప్రభుత్వానికి కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ఆదినుంచి అవరోధాలు కల్పిస్తూనే ఉన్నది.

2021 అసెంబ్లీ ఎన్నికలలో తన సహజ మతోన్మాద, విచ్ఛిన్నకర విధానాల ద్వారా కేరళలలోనూ ఏదో విధంగా మెజారిటీ సీట్లు సాధించి చక్రం తిప్పాలన్న బీజేపీ కల కల్ల అయింది. ఉన్న ఒక్క సీటు కూడా కోల్పోవడంతో గంగవెర్రులెత్తిన బీజేపీ అధినాయకత్వం...ఎల్డీఎఫ్ ప్రభుత్వానికి సహకరించకుండా ఉండేందుకు అన్ని ప్రయత్నాలు చేసింది. అవి సఫలం కాకపోవడంతో కేరళ రాష్ట్రంపై అక్కసు పెంచుకుంది. గవర్నర్‌ని ఉపయోగించి చేయవలసిందంతా చేసింది. అయితే ఆ కుయుక్తులన్నింటినీ ఎల్డీఎఫ్ ప్రభుత్వం సమర్థంగా ఎదుర్కొంది. గవర్నర్ దుశ్చర్యలపై సుప్రీం కోర్టును ఆశ్రయించింది. సుప్రీంకోర్టు మొట్టికాయలు వేయడంతో గవర్నర్ ఆరీఫ్ మహ్మద్ ఖాన్ దిగిరాక తప్పలేదు. దానితో కేరళను ఆర్థికంగా తీవ్ర సంక్షోభంలోకి నెట్టేందుకే కేంద్రం 'వివక్షా పూరితమైన, ప్రతీకారచర్యలు' చేపడుతున్నది. రాష్ట్ర ఆర్థిక వ్యవహారాల్లో కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా జోక్యం చేసుకుంటోంది. ఎగ్జిక్యూటివ్ చర్యలతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్ ప్రకియపై నియంత్రణ ప్రారంభించింది. రాష్ట్రానికి రుణాలు తీసుకునే, సొంత ఆర్థిక వ్యవస్థలను నియంత్రించే అధికారంలో జోక్యం చేసుకుంటోంది. కేంద్రం చర్యల వల్ల ఏర్పడిన సంక్షోభాన్ని తగ్గించడానికి కేరళకు తక్షణమే రూ.26, 226 కోట్లు కావాల్సి ఉందని ముఖ్యమంత్రి విజయన్ చెప్పారు. సంక్షోభాన్ని అధిగమించేందుకు ఇది సరిపోదని, కేంద్రం తీసుకున్న చర్యల వల్ల వచ్చే ఐదేళ్లలో రూ.2 లక్షల కోట్ల నుంచి రూ.3 లక్షల కోట్ల వరకు నష్టం కలుగుతుందని అంచనా. ఇది ఐదేళ్ల కాలంలో రాష్ట్ర జీడీపీలో 20 శాతం నుంచి 30 శాతం వరకు ఉంటుంది. దీని నుంచి బయటపడకపోతే పరిమితవనరులతో అభివద్ధి చెందుతున్న రాష్ట్రాన్ని దశాబ్దాల తర్వాత కూడా కోలుకోలేని సంక్షోభంలోకి నెట్టివేస్తుందన్న సీఎం ఆందోళనలో నిజం లేకపోలేదు. రాష్ట్ర ఆర్థిక వ్యవహారాల్లో కేంద్ర ప్రభుత్వం జోక్యాన్ని సవాలు చేస్తూ ఎల్డీఎఫ్ ప్రభుత్వం సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించింది. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక జోక్యాన్ని నిరసిస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన రెండో రాష్ట్రం కేరళ. గతంలో పంజాబ్ ప్రభుత్వం ఆహార ధాన్యాల సేకరణ సమయంలో కేంద్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర ప్రభుత్వం విధించిన రూ.4,000 కోట్లకు పైగా చట్టబద్ధమైన రుసుములను తిరిగి భర్తీ చేయకపోవడంపై కేంద్ర ప్రభుత్వంపై దావా వేసింది. రాజ్యాంగంలోని 131వ అధికరణం ప్రకారం కేరళ తన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ద్వారా దావా వేసింది. కేంద్ర ప్రభుత్వం రుణ పరిమితి విధించడం వల్ల సంవత్సరాలుగా చెల్లించని బకాయిలు పేరుకుపోతున్నాయని, తీవ్రమైన ఆర్థిక సంక్షోభానికి దారితీయవచ్చని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వ చర్యలతో రాష్ట్రప్రభుత్వం రూ.1,07,513.09 కోట్ల సంచిత వ్యయనష్టం, వనరుల లోటును చవిచూసిందని కోర్టుకు తెలిపింది. ఎల్డీఎఫ్ ప్రభుత్వం చేస్తున్న ఈ నిర్ణయాత్మక యుద్ధంలో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపక్షాలు, కేరళ ప్రజలు మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉంది.

ఉద్ధృత పోరు బాటలో మహిళా సమాఖ్య

అనేక సుదీర్ఘ పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) పిలుపునిచ్చింది. డిసెంబరు 8వ తేదీనుంచి 10వ తేదీ వరకు ఖరగ్‌పూర్‌లో జరిగిన ఎన్ఎఫ్ఐడబ్ల్యూ సమావేశానికి దేశ నలుమూలల నుంచి మహిళలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఖరగ్‌పూర్ నగరం మహిళల నినాదాలతో మారుమోగింది. "రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి, హక్కులను కాపాడుకోవాలి, లౌకికత్వాన్ని అమలు చేయాలి, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి, మతతత్వవాదులనుంచి దేశాన్ని రక్షించుకోవాలని మహిళలు గళమెత్తారు. ఎన్నో పోరాటాలుచేసి సాధించుకున్న హక్కులను హరించే కేంద్ర ప్రభుత్వ విధానాలను తూర్పారపట్టారు. ఖరగ్‌పూర్‌లోని గిరి మైదాన్ నుంచి ప్రారంభమైన ఊరేగింపు సుమారు నాలుగు కిలోమీటర్ల మేర నడిచి బహిరంగ సభాస్థలికి చేరింది. ఈ ర్యాలీని చూసేందుకు ప్రజలు భారీ సంఖ్యలో రోడ్డుకు ఇరువైపులా బారులు తీరారు. బాలికల నుంచి వృద్ధుల వరకు ఈ ఊరేగింపులో అత్యంత ఉత్సాహంతో పాల్గొన్నారు. మహిళల డిమాండ్లకు మద్దతుగా పురుషులు కూడా వారితో కవాతులో పాల్గొన్నారు. అటవీ భూముల సంరక్షణ కోసం, నీటిని వృథా చేయవద్దని, పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను హరించవద్దని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మహిళలందరూ ఐక్యంగా ప్రతిఘటించాలని వక్తలు పిలుపునిచ్చారు.

ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ప్రధాన కార్యదర్శి అనీ రాజా ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. దేశంలో రాజ్యాంగ ఉల్లంఘన జరుగుతోందని, అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను కాలరాస్తున్నారని అన్నారు. ముఖ్యంగా మహిళలు అణచివేతకు, వేధింపులకు గురవుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. తమ హక్కులను రక్షించుకునేందుకు మహిళలు తీవ్ర పోరాటానికి సిద్ధంకావాలన్నారు. ఈ బహిరంగ సభలో ముఖ్యవక్తగా పాల్గొన్న ప్రముఖ సామాజిక కార్యకర్త తీస్తా సెతల్వాద్ మాట్లాడుతూ, దేశంలో తలెత్తిన సమస్యలపై ఉమ్మడిగా ఉద్యమించాలన్నారు. దేశంలో నియంతృత్వ పాలనకు కేంద్ర ప్రభుత్వం కుటిలయత్నం చేస్తోందన్నారు. దేశంలో బహుళత్వాన్ని నాశనంచేసి నిరంకుశ విధానాలను అమలుచేయడం సరికాదన్నారు. దేశ చరిత్రను వక్రీకరించే మార్గాలను అమలు చేయాలనుకోవడం సమంజసం కాదన్నారు. దీనికి వ్యతిరేకంగా బలమైన ఉద్యమ నిర్మాణం జరగాలని సూచించారు. దీని కార్యాచరణలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ప్రముఖ పాత్ర పోషిస్తుందన్న విశ్వాసం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా జరిగిన వివిధ ఉద్యమాల్లో సీపీఐ పాత్రను సెతల్వాద్ గుర్తు చేశారు.

గిరిజన ఉద్యమ నాయకురాలు బస్వీకిరో మాట్లాడుతూ, మహిళలు, రైతులు, కార్మికులు, దళితులు, గిరిజనులు, రైతు కూలీలు తీవ్ర సంక్షోభంలో ఉన్నారన్నారు. సంఘటిత పోరాటాల ద్వారా పొందిన 'జల్ (నీరు), జమీన్ (భూమి), జంగల్ (అటవీ)' హక్కులను కార్పొరేట్ల ప్రయోజనాలకోసం కేంద్ర ప్రభుత్వం సవరించడం న్యాయం కాదన్నారు. జార్ఖండ్‌లో జరిగిన గిరిజన ఉద్యమానికి మద్దతుగా సీపీఐ పాత్రను ఆమె ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఈ సభలో సబీనా ఖాతూన్, నిషా సింధు, సాధనామీనా, శ్యామశ్రీ దాస్ తదితరులు మహిళలను ఉత్తేజితులను చేస్తూ ప్రసంగించారు. సమాఖ్య జెండాను కమలా సదానందన్ ఎగురవేశారు. అనంతరం అమరవీరుల స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిసెంబర్ 8న పెద్ద ఎత్తున ప్రారంభమైన ఎన్ఎఫ్ఐడబ్ల్యూ 22వ సమావేశం డిసెంబర్ 10న ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం రోజున మానవహారం కార్యక్రమంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సేవకులు విరివిగా పాల్గొన్నారు.

పొగబాంబు దాడిపైనా మోదీ-షా మౌనమేనా !

ఎం కోటేశ్వరరావు

లోక్‌సభలో 2023 డిసెంబరు పదమూడున జరిపిన పొగబాంబు దాడి నిందితులు అందరూ ఒకే రకమైన సమాధానం చెబుతున్నారు. ఎవరో వారి బ్రెయిన్ వాష్ చేశారని అనుకుందాం. ఇప్పుడు అది ప్రధానం కాదు. దాడి జరిగిన తరువాత ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా నోరు విప్పకపోవటమే అసలైన సమస్య. వారి మౌనం, పార్లమెంటుకు రాని కారణంగా గురు, శుక్రవారాల్లో పార్లమెంటులో ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. ఈ అంశం గురించి చర్చించాలని కోరగా ప్రభుత్వం నిరాకరించింది. దాంతో సభ్యుల పట్టు కారణంగా అనేక అంతరాయాల తరువాత సోమవారానికి వాయిదా పడింది. బయట మాట్లాడుతూ సభకు రాకుండా, మౌనంగా ఉండేట్లు వారి బుద్ధులను ఎవరు శుద్ధి చేసినట్లు ? దీన్ని రాజకీయం చేయవద్దని కబుర్లు చెబుతున్నారు. ఎవరూ అలాంటి ఆరోపణలూ ఎవరి మీదా చేయలేదు. బీజేపీ నోట రాజకీయం మాట ఎందుకు వచ్చింది? దాడి గురించి చెప్పమని అడిగితే రాజకీయం అంటారా? దేశ పౌరులు దేని గురించి ఆందోళన చెందాలి ? అసలేం జరుగుతోంది ? ఏ కథనాన్ని వండి వార్చేందుకు తెరవెనుక బీజేపీ పెద్దలు మధనం జరుపుతున్నట్లు? నిందితులు లోక్‌సభ ప్రేక్షకులుగా ప్రవేశించేందుకు మైసూరు బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహ పాసులు ఇచ్చినట్లు తేలింది. అదే ప్రతిపక్షాలకు చెందిన వారెవరైనా ఇచ్చి ఉంటే ఇక చెప్పాల్సిందేముంది? ఈ పాటికి రచ్చ రచ్చ చేసేవారు. పార్టీ, లోక్‌సభ స్పీకర్ గానీ సదరు ఎంపీ నుంచి వివరణ కోరినట్లు, పోలీసులు ప్రశ్నించినట్లుగానీ ఇంతవరకు ఎలాంటి సమాచారం లేదు. ఆయనను బయటపడవేసేందుకు, తద్వారా బీజేపీ పరువు నిలుపుకునేందుకు చూస్తున్నారా ? దాడి సందర్భంగా నిందితులు చేశారని చెబుతున్న నినాదాలు నిరంకుశత్వం, నిరుద్యోగం, రైతుల ఆందోళన వంటి అంశాలపై నిజమే అయితే వాటి గురించి దేశంలో మరోసారి చర్చ జరిగితే, అది కూడా బీజేపీకి రాజకీయంగా దెబ్బే. రానున్న ఎన్నికల్లో ఇది ఎలాంటి ప్రభావం చూపుతుంది, దాన్నుంచి ఎలా తప్పించుకోవాలి, ఎవరి మీద నెపం నెట్టి జనం దృష్టిని మళ్లించాలని చూస్తున్నారు ? ఈ నెల 22 వరకు పార్లమెంటు శీతాకాల సమావేశాలు జరగాల్సి ఉంది.

లోక్‌సభలో పొగబాంబు దాడికి సూత్రధారి అని చెబుతున్న కోల్‌కతాకు చెందిన లలిత్ మోహన్ ఝా అనే యువకుడిని రాజస్థాన్‌లో పట్టుకున్నట్లు, అతనే లొంగిపోయినట్లు వార్తలు వచ్చాయి. అతను సామ్యవాది సుభాస్ సభ పేరుతో ఒక స్వచ్ఛంద సంస్థ ఒక శాఖకు అధ్యక్షుడిగా ఉన్నాడని చెబుతున్నారు. దాడి తరువాత లోక్‌సభ వెలుపలి దృశ్యాలను ఫోన్ ద్వారా వీడియో తీసి వాట్సాప్‌లో పెట్టినట్లు, ఆ ఫోన్‌తో పాటు దాడిలో పాల్గొన్న నలుగురి ఫోన్లనూ ధ్వంసం చేసినట్లు పోలీసులు చెబుతున్నారు. దాడి తరువాత బస్‌లో హరియాణా సరిహద్దు సమీపంలో రాజస్థాన్‌లోని కుచమన్ వెళ్లి ఆ రాత్రి అక్కడ ఒక హోటల్లో ఉండి, గురువారం ఢిల్లీ వచ్చి పోలీసులకు లొంగినట్లు వార్తలు. దాడి జరిపేందుకు గత కొద్ది నెలలుగా పార్లమెంటు పాసుల కోసం ప్రయత్నించినట్లు చెప్పాడట. తన కోసం అనేక పోలీసు బృందాలు గాలిస్తున్నట్లు గ్రహించి తానే వచ్చి లొంగినట్లు, తన ఫోన్ ద్వారానే వీడియోలు తీస్తున్నట్లు, దాడి నిందితులైన అమోల్, మనోరంజన్, సాగర్, నీలమ్ ఫోన్లను రాజస్థాన్‌లో ధ్వంసం చేసినట్లు ఝా చెప్పాడు. రాజస్థాన్‌కు చెందిన ఝా స్నేహితుడు మహేష్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధ చట్టం(ఉపా) కింద వారిని అరెస్టు చేశారు. వారికి బెయిలు రాదు. నిందితులు రెండు సంస్థల పేర్లతో పాటు ఒకే విధమైన సమాధానాలు చెబుతున్నారని, దొరికితే ఏం చెప్పాలో కూడా వారు ముందుగానే నిర్ణయించుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. మొత్తం ఆరుగురు ఫేస్‌బుక్‌లో భగత్ సింగ్ పేరుతో ఒక గ్రూపుగా చేరినట్లు, రైతుల నిరసన, మణిపూర్ ఉదంతాలు, నిరుద్యోగం వంటి అంశాల మీద తాము ఆగ్రహం చెందినట్లు అందుకే తామీ పని చేసినట్లు అమోల్, మిగతా వారు కూడా అలాగే చెప్పారని అంటున్నారు. వీరికి ఎలాంటి ఉగ్రవాద సంస్థతో సంబంధాలు ఉన్నట్లు కనిపించటం లేదని పోలీసులు పేర్కొన్నట్లు పీటీఐ వార్తా సంస్థ తెలిపింది. దుండగులు లోక్‌సభ లోపల, వెలుపల ఎలాంటి హానికరంకాని పొగబాంబులు పేల్చారు. వారంతా ఢిల్లీ శివార్లలోని హరియాణా, గురుగ్రామ్‌కు డిసెంబరు పదిన చేరుకున్నారు. పదమూడవ తేదీన పాసులు తీసుకున్న ఇద్దరు గాలరీ నుంచి సభలోకి దూకి పొగ బాంబులు పేల్చారు. బయట ఉన్నవారు వెలుపల పేల్చారు. లోపల ఎంపీలే వారిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. 2001లో పార్లమెంటు భవనంపై ఉగ్రవాదులు దాడిచేసిన రోజునే వీరు ఎంచుకున్నారు.

దాడి ఉదంతం గురించి ప్రకటన చేసేందుకు ప్రధాని మోదీ సభకు రావాలని, హోం మంత్రి అమిత్ షా ప్రకటన చేయాలని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. ఇలా అనుచితంగా ప్రవర్తించారంటూ గురువారం లోక్‌సభలో 14 మందిని, రాజ్యసభలో ఒకరిని సస్పెండ్ చేశారు. లోక్‌సభలో డీఎంకే ఎంపీ పార్థీవన్ అసలు సభకు రాలేదని, చెన్నైలో ఉన్నట్లు గుర్తించి నాలుక కరుచుకొని పేరు తొలగించారు. పార్లమెంటు ప్రాంగణంలో భద్రత లోక్‌సభ కార్యాలయానిదని స్పీకర్ ఓం బిర్లా ప్రకటించి ప్రభుత్వానికి సంబంధం లేదనే అభిప్రాయం కలిగించేలా చూశారు. ఉదంతం జరిగింది సభలో అయినా దుండగులు వెలుపలి నుంచి వచ్చారు. పార్లమెంటుకు ప్రత్యేకంగా భద్రతా సిబ్బంది ఉండరు. కేసు నమోదు వెలుపల జరిగింది గనుక ప్రభుత్వమే జవాబు చెప్పాల్సి ఉంటుంది. భద్రత లోపాలకు కారకులంటూ ఎనిమిది మంది సిబ్బందిని లోక్‌సభ కార్యాలయం సస్పెండ్ చేసింది.

విపరీత ప్రవర్తన ఉన్న పిల్లలను, లేదా పెద్ద వారిని వైద్యులకు చూపించాల్సి ఉంటుందని తెలిసిందే. ప్రధానిగా ఉన్న నరేంద్రమోదీ అనేక అంశాలపై మౌనంగా ఉండటాన్ని ఎలా అర్థం చేసుకోవాలో తెలియక జనం జుట్టుపీక్కుంటున్నారు. ప్రతి అంశం మీద ప్రధాని మాట్లాడాల్సిన అవసరం లేదని బీజేపీ మద్దతుదారులు సమర్థిస్తారు. దేనికైనా ఒక హద్దు ఉంటుంది. పార్లమెంటు మీద జరిగిన దాడి గురించి కూడా మాట్లాడకపోవటాన్ని ఎలా అర్థం చేసుకోవాలి ! అసలు జవాబుదారీ తనం ఉన్నట్లేనా ? రెండు వందల మందికి పైగా మరణించి, మరికొన్ని వందల మంది గాయపడి, 70వేల మంది నెలవులు తప్పినా మణిపూర్ రాష్ట్రాన్ని సందర్శించేందుకు మే మూడవ తేదీ నుంచి ఇప్పటి వరకు ప్రధాని వెళ్లలేదు. ఇద్దరు మహిళలను వివస్త్రలను చేసి తిప్పినట్లు వీడియోలు వెల్లడైన తరువాత మూడు నెలలకు మొక్కుబడిగా స్పందించారు. అందుకే అహ్మదాబాద్‌లో క్రికెట్ మాచ్ చూడటానికి, ఉక్రెయిన్, ఇజ్రాయిల్ గురించి పట్టించుకోవటానికి తీరిక ఉంటుంది గానీ, మణిపూర్ వెళ్లటానికి ప్రధాని కుదరలేదనే విమర్శలు వెల్లువెత్తాయి. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో మిజోరం వెళ్లి ప్రచారం చేసేందుకు ధైర్యం చేయలేకపోయారు. పక్కనే ఉన్న రాష్ట్రం తగులబడితే చూడటానికి రాలేదుగానీ తగుదునమ్మా ఓట్ల కోసం వచ్చారా అనే విమర్శకు భయపడే అలా చేశారన్నది స్పష్టం. వ్యక్తిగతంగా తనకు, బీజేపీకి ఇబ్బంది వచ్చినపుడు మౌనంగా ఉండటం, తరువాత అవకాశం వచ్చినపుడు పార్టీలో తన ప్రత్యర్థులు వెలుపల రాజకీయ వ్యతిరేకుల మీద దాడి చేయటం నరేంద్రమోదీ నైజంగా కనిపిస్తున్నది. గుజరాత్ బీజేపీలో కుమ్ములాటలు, అధికార దెబ్బలాటల్లో జరిగింది అదే. చివరికి గురువు వంటి అద్వానీకే ఏ గతి పట్టించిందీ చూశాము. అందువలన మోదీ మౌనం బలహీనత కాదు, ప్రమాదకరమైన ఆయుధం అని గ్రహించాలి. కౌటిల్యుడి ఎత్తుగడలు తప్ప మరొకటి కాదు. ఇలాంటి వైఖరితో ఎంతకాలం ముందుకు పోతారు, ఏమి సాధిస్తారు అన్నది ప్రశ్న. గణితంలో రెండు రెళ్లు ఎక్కడైనా నాలుగే, కానీ రాజకీయాల్లో కాదు.

ఫోన్: 8331013288

దేవుడున్నాడు- అజ్ఞానం కూడా ఉంది!



డాక్టర్ దేవరాజు మహారాజు

దేవుడున్నాడని నమ్మే భక్తులతో పాటు మనం కూడా ఉన్నాడనే నమ్ముదాం. ఎందుకంటే ప్రపంచంలో చీకటి ఉంది. అజ్ఞానం ఉంది. లేవని అనలేం కదా? అలాగే దేవుడు కూడా ఉన్నాడు. అజ్ఞానం ఉన్న చోట దేవుడుంటాడు. జ్ఞానం వెలుగులు ప్రసరించిన చోట మాయమైపోతాడు. ఇందులో మరో మాటకు తావులేదు. ఊరికే దైవ భక్తుల విశ్వాసాలతో గొడవ ఎందుకూ? దేవుడున్నాడు. అజ్ఞానం కూడా ఉంది. ఆ రెండూ ఒకటే కాబట్టి- అజ్ఞానంలో దేవుడున్నాడు! దైవ భావనలో అజ్ఞానం ఉంది!! యదార్థాన్ని ఒప్పుకోని వారితో మనకు పేచీ లేదు. ఈ రకంగా కూడా ఒకసారి ఆలోచించి చూడమని చెపుతున్నాం అంతే!!

పాలల్లో నెయ్యి కనబడదు. ఈ విశ్వంలో దేవుడు కనబడడు. పాలల్లో నెయ్యి కనబడనంత మాత్రాన నెయ్యి లేనట్టు కాదుగదా? అని ఆస్తికులు వితండవాదం చేస్తుంటారు. వాళ్లు ఆలోచించాల్సిందేమంటే- పాలల్లో నెయ్యి తియ్యడాని ఒక పద్ధతి ఉంది. ఆ పద్ధతి ప్రకారం ఎవరు చేసినా, ఎప్పుడు చేసినా, ఎక్కడ చేసినా పాల నుంచి నెయ్యి తియ్యొచ్చు. అలాగే విశ్వంలోని దేవుణ్ణి వెలికి తీయడానికి శతాబ్దాలుగా యోగులు, భక్తులు ప్రయత్నిస్తున్నారు. అయినా బయటపడడం లేదు. అన్ని మతాల భక్తులూ ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఎవరేం చేసినా అంతా వృథా! ఏ దేవుడూ ఎక్కడా ఎప్పుడూ ఎవరికీ కనబడలేదు. సింబాలిక్‌గా వ్యాఖ్యానాలు చేయడం సులభమేమో గాని, నిజంగా వెతికి చూపడం సాధ్యం కాలేదు. ఇక ముందు కూడా కాదు. లేనిది చూపడం, శూన్యాన్ని ప్రదర్శించడం ఎవరివల్లా కాదు. అలా చూపిస్తామన్న వాళ్లు మోసగాళ్లవుతారు. అలాంటి వారికి చట్ట ప్రకారం శిక్షలు వేయాలేగానీ, స్వేచ్ఛగా సభ్య సమాజంలో తిరగనీయరాదు. మెదళ్లు లేని జనం అలాంటి వారి పాదాలమీద పడి దొర్లుతూ ఉంటే, బుద్ధిలేని ప్రభుత్వాలు వారికి వసతులు కల్పిస్తున్నాయి! చూసి ఆనందిస్తున్నాయి!!

సూర్యుడి కిరణాలు చర్మానికి స్పర్శ ద్వారా తెలుస్తున్నాయి. సూర్యుడు ఉన్నాడు అని అనడానికి ఆధారముంది. మరి దేవుడను వాడు ఉంటే అతడి కిరణాలేవీ? అతడి దయకు, చల్లని చూపుకు ఆధారాలేవీ? ఆస్తికులు మేజిక్కులు రాసుకుని తృప్తి పడుతుంటారు. జనమంతా ఆ మేజిక్కులకు, గిమ్మిక్కులకు పరవశించి పోవాలని ఆశిస్తుంటారు. దేవుడుంటే హత్యలు, అత్యాచారాలు ఎందుకు జరుగుతున్నాయి? నేరాలని ఆపలేని దేవుడు నీ కష్టాలని తీరుస్తాడని ఎలా నమ్ముతున్నావ్? దేవుడుంటే తప్పు చేసిన వారిని శిక్షించాడని, శపించాడని, చంపాడని రకరకాలుగా కట్టుకథలు రాసుకుని శతాబ్దాలుగా ప్రచారం చేస్తున్నారు కదా? మరి ఇప్పుడు సమాజంలో కొందరు తప్పులు చేస్తున్నారు. నేరాలకు, ఘోరాలకు పాల్పడుతున్నారు. "సంభవామి యుగే యుగే"- అని చెప్పుకున్న ఆ దేవుడు ఎందుకు రావడం లేదూ? తన విద్యుక్త ధర్మాన్ని మరిచినవాడు దేవుడెలా అవుతాడు? ఏ పనీ చేతకానప్పుడు ఉన్నా, లేకున్నా ఒకటే కదా? అంటే అంతా అబద్ధమేనన్నమాట! కల్పించుకున్న కట్టుకథలతో ఎంత కాలమని స్వాంతన పొందుతారు? వాస్తవాల నుంచి ఎంత కాలమని పారిపోతారు? దేవుడు ఉన్నాడని ఘంటాపథంగా ప్రచారం చేసే పురాణాల విషయానికొద్దాం!

"రామాయణ, మహాభారత, భాగవత గ్రంథాలన్నీ పుక్కిటి పురాణాలు కావు, ఇతిహాసాలు!!"- అని గొప్పగా చెప్పుకునేవారు ఒక ప్రశ్నకు సమాధానమివ్వాలి. ఇతిహాసం- అంటే చరిత్ర! మరి ఈ పురాణ గ్రంథాలలో చారిత్రక అంశాలేవీ? బుద్ధుడి గురించి గానీ, మౌర్య వంశం గురించి గానీ, గుప్త రాజుల గురించి గానీ, హర్షుడి గురించి గానీ ఎక్కడా ఏవీ లేవెందుకు? ఏడు వందల యాభై యేళ్ల క్రితం బౌద్ధ విశ్వవిద్యాలయాలు తగులబెట్టి నాశనం చేసిన సంఘటనలు ఈ ఇతిహాసాల్లో లేవెందుకు? ఈ వివరాలన్నీ ఆనాటి చీనీ యాత్రికుల నోట్స్ నుంచి సంగ్రహించుకోవల్సి వచ్చింది కదా? చివరకు సింధూ నాగరికత గురించి ఈ ఇతిహాసాల్లో ఏమైనా ఉందా? ఏదీ లేదే? మరి వీటిని 'ఇతిహాసాలని' ఎలా అంటారు? పుక్కిటి పురాణాలనే అనాలి! పైగా, బుద్ధుడి కాలంలో ఏ సంస్కృతి ఉంది? బుద్ధుడి తండ్రి ఏ ధర్మం పాటించేవాడు? అని ప్రశ్నిస్తూ అతి తెలివి ప్రదర్శిస్తారు.

ముందు విశ్వాసాల్ని, కట్టుకథల్ని, మహిమల్ని పక్కన పెట్టి యదార్థాల్ని అర్థం చేసుకోగలిగితే, అన్నీ అర్థమవుతాయి. బుద్ధుడి కాలంలో విలసిల్లింది శ్రమ సంస్కృతి. అశోకుడి స్థంభాల గురించి ఈ బ్రాహ్మణ వాదులకు తెలియదు. తెలుసుకోరు. పైగా అశోక స్థంభాన్ని 'భీముడి గద' అని ప్రచారం చేస్తారు. ఆ స్తంభాల మీద చెక్కి ఉన్న శాసనాలు కూడా అర్థం చేసుకోరు. రామాయణ, మహాభారతంలోని అంశాలు అందులో చెక్కి ఉన్నాయని భ్రమపడతారు. జనానికి కూడా అదే భ్రమ కల్పిస్తారు. ముందు కాస్త చరిత్ర, భూగోళం, సైన్సు చదువుకోండిరా బాబూ! రామాయణ, భారతాల్ని కావ్యాలనండి, సృజనాత్మక రచనలనండి. అందరూ ఒప్పుకుంటారు. ఇతిహాసాలంటారా? మీరు తప్పులో కాలేసినట్టే. చరిత్రకు ఆధారాలుంటాయి. కట్టు కథలకు ఆధారాలుండవు.

గత ఏడు, ఏనిమిది వందల ఏళ్ల క్రితం తీరిగ్గా కూచుని రాసుకున్న ఈ కల్పిత గాథల్ని- ఆ దేవదేవుడే దిగివచ్చి మానవుడికి అందించిపోయాడని మరో కట్టుకథ అల్లి చెప్పుకోండి. సాధారణ శకానికి ముందు (అంటే క్రీ.పూ) నాలుగైదు వేల యేళ్ల క్రితం నాటి చరిత్ర అంతా పరిశోధకులు వెలికి తీశారు కదా! మీ దేవ దేవుడు ఎక్కడా కానరాలేదు. ఆయన వేదాలు, పురాణాలు ఎక్కడ ఎప్పుడు ఇచ్చాడో తేదీ, సమయం గట్రా ఆధారాలు తీసి చూపండి. ఉట్టి విశ్వాసాలు ఇప్పుడు నడవ్వు. విశ్వాసాల యుగం అంతమైపోయింది. ప్రతిదీ క్షుణ్ణంగా అధ్యయనం చేసి తెలుసుకునే యుగం ప్రారంభమైంది. ఇంకా చచ్చు పుచ్చు కథలు చెపుతామంటే జనం నమ్మరు. కాలం మారింది. తరం మారింది. వైజ్ఞానిక అవగాహన పెరిగింది. "విజ్ఞానం ద్వారా బలమైన తాత్త్వికత, నిజాయితీ, బుద్ధి కుశలత లభిస్తాయి. శ్రమ పట్ల గౌరవం ఏర్పడుతుంది. పెరుగుతుంది."- అని అన్నారు ప్రసిద్ధ రష్యన్ రచయిత మాక్జిమ్ గోర్కీ.

అన్నం ఉడికిందా లేదా తెలుసుకోవడానికి ఒకటి రెండు మెతుకులు చూస్తే చాలునన్నట్లు - పురాణాల్ని అసంబద్ధమైన, తలాతోకా లేని కట్టుకథలని తేల్చడానికి ఒకటి రెండు విషయాలు విశ్లేషించుకుంటే చాలు! రాముడు హనుమంతుడి ఆరాధ్య దైవం. అలాంటి దేవుడి గుప్తాంగాల వివరాలు భక్తుడికి ఎలా తెలుస్తాయి? వాల్మీకి రామాయణం, సుందరకాండ, 35వ సర్గ, 17వ శ్లోకం చదివిన వారికి కరెంటు షాక్ తప్పదు. 1927 నాటి ప్రతి నుంచి, ఇటీవలి ముద్రణ వరకు (గీతా ప్రెస్- గోరక్‌పూర్) విషయం అంతా ఒకటే. మార్పులేదు. రాముడి గుప్తాంగాల వర్ణన హనుమంతుడు చేయడం- అదీ సీతకు వినిపించడం ఏమిటో మనబోటి వారికి అర్థమే కాదు. "పురాణాల్లో బూతు పురాణాలు వేరయా అని కాదు, పురాణాలంటే బూతు పురాణేలేనయా" అని అనుకోవాల్సి వస్తోంది. విజ్ఞులు ఆలోచించాలి. ఎవరి దగ్గరైనా గీతాప్రెస్ వారు ముద్రించిన మహాభారతం ఉంటే, అందులో అనుశాసన పర్వం తిరగేయండి. "పురాణాలు వచ్చి మన పతనానికి కారణములయినవి. ఇవన్నీ పరస్పర విరుద్ధాలు. పిట్ట కథలకు పుట్టినిండ్లు. బూతుల బుంగలు...మనకు ప్రమాణ బుద్ధే గాని, పరిశీలన బుద్ధిలేదు. ఇందువల్ల మనం ఆలోచించడం మానినాము. మానవుడు బుద్ధిజీవి గనుక, దేనినైనను ఆలోచించి చేయవలెను. ఈ గ్రంథాన్ని సొంతము చదివి తమ బుద్ధిని ఉపయోగించవలసినదని పాఠక లోకమును కోరుచున్నాను."

కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త

ఆ డబ్బు నాది కాదు

తొలిసారి పెదవి విప్పిన ధీరజ్ సాహు

భువనేశ్వర్: పది రోజులుగా తన మద్యం డిస్టిలరీ, దాని అనుబంధ సంస్థలపై కొనసాగిన తనిఖీల్లో లెక్కల్లో చూపని రూ.351 కోట్ల నగదు కనుగొన్నట్టు ఆదాయపు పన్ను శాఖ అధికారులు ప్రకటించడంపై ఒడిశా కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు ధీరజ్ ప్రసాద్ శనివారం తొలిసారి పెదవి విప్పారు. పట్టుబడిన సొమ్ము తనది కాదని, వందేళ్లకు పైగా తమ కుటుంబ సభ్యులు వ్యాపారంలోనే ఉన్నారని, అదంతా మద్యం అమ్మకాల ద్వారా వచ్చిందేనని చెప్పారు. ఈ డబ్బుతో కాంగ్రెస్ పార్టీకి కానీ, మరే పార్టీకి కానీ సంబంధం లేదని స్పష్టం చేశారు. తన కుటుంబ వ్యాపారాలను మరింత వివరిస్తూ వందేళ్లకు పైగా తన కుటుంబం మద్యం వ్యాపారంలో ఉందని, పాఠశాలలు, కాలేజీలు ఏర్పాటు చేయడం వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని చెప్పారు. లిక్కర్ వ్యాపారం అంతా నగదులోనే జరుగుతుందనే విషయం అందరికీ తెలిసిందేనని అన్నారు. ఆ డబ్బంతా తనది కాదని, తన కుటుంబానికి, ఇతర కంపెనీలకు చెందినదని వివరించారు. పట్టుబడిన సొమ్ము నల్లధనమా, చట్టబద్ధమైన ధనమా అనేది ఐటీ శాఖ చెబుతుందన్నారు. ఈ వ్యాపారంలో తన ప్రత్యక్ష ప్రమేయం ఏదీ లేదని చెప్పారు. దీనికి సంబంధించిన ఏ ప్రశ్నలకైనా తన కుటుంబ సభ్యులు సమాధానం చెబుతారన్నారు. సాహుకు చెందిన బౌద్ధ్ డిస్టిలరీ ప్రైవేట్ లిమిటెడ్, దాని అనుబంధ సంస్థల్లో ఈనెల 6న ప్రారంభమైన ఐటీ దాడులు శనివారంతో ముగిశాయి. ఒడిశా, జార్ఖండ్, పశ్చిమబెంగాల్‌లోని అనేక ప్రాంతాల్లో జరిపిన దాడుల్లో రూ.351 కోట్ల నగదు, మూడు కిలోల బంగారం పట్టుబడింది.

రతన్ టాటాకు బెదిరింపులు

ముంబై: ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటా ప్రాణానికి ముప్పు ఉందని గుర్తు తెలియని వ్యక్తి నుండి పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ కాల్ బెదిరింపులు రావడం కలకలం రేపింది. ఈ వార్త ఆలస్యంగా వెలుగుచూసింది. ముంబై పోలీసు కంట్రోల్ రూమ్‌కు గుర్తుతెలియని వ్యక్తి నుండి ఫోన్ కాల్ వచ్చింది. రతన్ టాటాకు భద్రత పెంచాలని, లేదంటే ఆయనకు సైరస్ మిస్త్రీలాగే అవుతుందని బెదిరించాడు. సైరస్ మిస్త్రీ టాటా సన్స్‌కు మాజీ చైర్మెన్‌గా బాధ్యతలు నిర్వహించారు. సైరస్ మిస్త్రీ గతేడాది అహ్మదాబాద్ నుంచి ముంబై వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై మరణించారు. ఇప్పుడు ఈ బెదిరింపు ఫోన్‌కాల్‌తో పోలీసులు అప్రమత్తమయ్యారు. రతన్ టాటాకు భద్రతను కట్టుదిట్టం చేశారు. టాటా ఇంటి సమీపంలో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ఫోన్ కాల్ చేసిన వ్యక్తి గురించి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు పూనెకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఆ వ్యక్తి కర్నాటకలో ఉన్నట్లు గుర్తించి అతడిని అరెస్టు చేశారు. అయితే బెదిరింపు కాల్ చేసిన నిందితుడు ఇంజినీరింగ్ చదివి ఎంబీఏ పూర్తి చేశాడని, అతడు సిజోఫ్రేనియా అనే మానసిక సమస్యలతో బాధపడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. పూనెలో అతని ఇంటికి వెళ్లిన పోలీసులు... అతను 5 రోజుల నుంచి కనిపించడం లేదని తెలుసుకున్నారు. బోసారి పోలీసు స్టేషన్‌లో నిందితుడిపై కేసు నమోదు చేశారు. అతడు ఇంట్లో నుండి వెళ్లేటప్పుడు కుటుంబ సభ్యుల ఫోన్ తీసుకెళ్లిపోయాడు. ఆ ఫోన్ నుండి ముంబై పోలీసులకు బెదిరింపు కాల్ చేసినట్లు గుర్తించారు.

విదేశీ పర్యటనల్లో మోదీ రికార్డు

న్యూఢిల్లీ: ఈ ఏడాది ఒక అద్భుతమైన సంవత్సరమని, భారతదేశం బలీయమైన ప్రపంచ శక్తిగా ఆవిర్భవించడాన్ని ఇది సూచిస్తుంది. ప్రధానమంత్రి దౌత్య కార్యక్రమాల్లో ఇది స్పష్టంగా కనిపించిందని కేంద్రం తెలిపింది. కొద్దిరోజుల్లో 2023 చరిత్రలో కలిసిపోతుండగా.. కొత్త ఏడాదిలోకి అడుగుపెట్టే సమయం ఆసన్నమైంది. ఈ క్రమంలో ఈ ఏడాదిలో ప్రధాని మోదీ చేసిన అధికారిక విదేశీ పర్యటనలు, ఈ సందర్భంగా అందుకున్న గౌరవాలు, కుదుర్చుకున్న ఒప్పందాల గురించి మైగవ్‌ఇండియా వరుస ట్వీట్లు చేసింది. 26 ఏళ్ల తర్వాత ఈజిప్టు, 40 ఏళ్ల తర్వాత గ్రీస్, తొలిసారి పపువా న్యూగినియాకు వెళ్లిన ప్రధానిగా మోదీ చరిత్ర సృష్టించారు. తమ దేశ అత్యున్నత పురస్కారాలు ఇచ్చి ఆరు దేశాలు మోదీని గౌరవించాయి. మొత్తంగా 15 ప్రతిష్ఠాత్మక పురస్కారాలు దక్కాయి. ప్రపంచదేశాల మధ్య పెరుగుతోన్న సహకారానికి 'ఇండియా-మిడిల్ ఈస్ట్-యూరప్ ఎకనామిక్ కారిడార్' ఒక కలికితురాయని కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఆ పోర్టల్ పోస్టులు పెట్టింది. విదేశీ పర్యటనల సమయంలో ప్రవాస భారతీయులు, ఆయా ప్రభుత్వాల నుంచి మోదీ విశేష ఆదరణ సొంతం చేసుకున్నారు. పపువా న్యూగినియా ప్రధాని జేమ్స్ మరాపే మోదీకి స్వాగతం పలికారు. మోదీ కాళ్లకు నమస్కరించారు. అప్పట్లో ఈ దృశ్యాలు వైరల్ అయ్యాయి. ఈ ఏడాది జూన్‌లో అమెరికా పర్యటన వేళ... చరిత్రాత్మక ఒప్పందాలు కుదిరాయి.

విదేశీ నౌక హైజాక్

తిప్పికొట్టిన భారత నేవీ

న్యూఢిల్లీ: ఐరోపా ద్వీప దేశం మాల్టాకు చెందిన ఓ వాణిజ్యనౌక అరేబియా సముద్రంలో హైజాక్‌కు గురైంది. సోమాలియా వెళ్తున్న ఎంవీ రుయెన్ నౌకలోకి కొందరు సముద్రపు దొంగలు చొరబడ్డారు. ఆ నౌక నుంచి మేడే కాల్ రావడంతో భారత నౌకాదళం అప్రమత్తమైంది. దాన్ని కాపాడేందుకు ఎయిర్‌క్రాఫ్ట్, యుద్ధనౌకను రంగంలోకి దించింది. ఈ మేరకు భారత నేవీ శనివారం అధికారిక ప్రకటనలో వెల్లడించింది. డిసెంబరు 14 రాత్రి సమయంలో ఎంవీ రుయెన్ నౌక యూకే మెరైన్ ట్రేడ్ ఆపరేషన్స్(యూకేఎంటీఓ) పోర్టల్‌లో మేడే (అత్యవసర పరిస్థితిని తెలియజేసే) సందేశం పంపింది. నౌకలోకి ఆరుగురు గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించినట్లు సమాచారం అందించింది. దీంతో భారత నేవీ వేగంగా స్పందించింది. అరేబియా సముద్రంపై గస్తీ కాస్తున్న నావల్ మారిటైం పెట్రోల్ ఎయిర్‌క్రాఫ్ట్, గల్ఫ్ ఆఫ్ ఎడెన్‌లో విధుల్లో ఉన్న యాంటీ పైరసీ పెట్రోల్ యుద్ధ నౌకను అప్రమత్తం చేసిందని నేవీ తెలిపింది. హైజాక్‌కు గురైన ఆ నౌకలో 18 మంది సిబ్బంది ఉన్నారు. నౌకపై వారు నియంత్రణ కోల్పోయినట్లు యూకే మెరైన్ ట్రేడ్ ఆపరేషన్స్ వెల్లడించింది. రుయెన్ నౌకకు సాయం చేసేందుకు భారత నేవీ విమానం, యుద్ధనౌక అక్కడకు చేరుకున్నాయి. హైజాకర్ల కుట్రను భగ్నం చేశాయి. 2017 తర్వాత సోమాలియా పైరెట్లు (సముద్రపు దొంగలు) నౌకలపై జరిపిన తొలి అతిపెద్ద దాడి ఇదే. దీంతో అరేబియా సముద్రంలో ప్రయాణిస్తున్న నౌకలకు బ్రిటన్ నౌకాదళం హెచ్చరికలు పంపింది. సోమాలియా తీరం సమీపంలో అప్రమత్తంగా ఉండాలని సూచించింది. పరిస్థితులు అనుమానాస్పదంగా ఉంటే తక్షణమే తమకు నివేదించాలని తెలిపింది.

2024 తర్వాతే మహిళా కోటా అమలు

నిర్మలా సీతారామన్

బెంగళూరు: మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. 2024 జనాభా లెక్కల తర్వాత మహిళ రిజర్వేషన్ బిల్లు అమలుకు తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. దక్షిణ కన్నడ జిల్లాలో రాణి అబ్బక్క స్మారక తపాలా బిళ్లను కేంద్ర మంత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. జాతి నిర్మాణంలో మహిళల పాత్ర గణనీయమైనదని ప్రధాని భావిస్తుంటారని, మహిళా రిజర్వేషన్ బిల్లు ద్వారా దానికి వాస్తవరూపం కల్పించారని చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ద్వారా లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించనున్నారు. సెప్టెంబర్‌లో ఈ బిల్లును పార్లమెంటు ఆమోదించగా, సెప్టెంబర్ 29న దీనికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేశారు. కాగా, పోర్చుగీసు వారికి ఎదురొడ్డి నిలిచిన వీరవనిత రాణి అబ్బక్క అని, 16వ శతాబ్దానికి చెందిన ధీరవనిత అని నిర్మలా సీతారామన్ ప్రశంసించారు. సామ్రాజ్యవాద శక్తులతో పోరాడిన ఎందరో వెలుగులోకి రాని వీరుల చరిత్రను డాక్యుమెంటేషన్ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. మహిళా స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రపై మూడు పుస్తకాలు తెచ్చేందుకు 'అమర్ చిత్ర కథ'తో కేంద్ర సాంస్కృతిక సంస్థ ఒప్పందం చేసుకుందని తెలిపారు. కర్నాటకలో రాణి అబ్బక్క పేరుతో సైనిక్ స్కూల్ ఏర్పాటు జరుగుతుందన్న ఆశాభావాన్ని నిర్మలా సీతారామన్ వ్యక్తం చేశారు.

అమర వీరులకు మోదీ నివాళి

న్యూఢిల్లీ: విజయ్ దివస్ సందర్భంగా పోరాట యోధుల త్యాగాలను ప్రధాని మోదీ స్మరించుకున్నారు. 1971 యుద్ధంలో పాకిస్థాన్‌పై భారత్ జరిపిన పోరాటం స్ఫూర్తిదాయకమని, ఆ పోరాటంలో అసువులుబాసిన అమరులకు నివాళి అర్పిస్తున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి ఆయన ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. యుద్ధంలో సైనికుల పరాక్రమం, అంకితభావం దేశానికి గర్వకారణంగా నిలిచాయని, వారి త్యాగాలు, స్ఫూర్తి ప్రజల హృదయాల్లో, దేశ చరిత్రలో చెరగని ముద్రలా నిలిచిపోతాయని పేర్కొన్నారు. అమరవీరులందరికీ నివాళి అర్పిస్తున్నట్లు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. విజయ్ దివస్ సందర్భంగా కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అమరజవాన్లకు దిల్లీలోని నేషనల్ వార్ మెమోరియల్ వద్ద నివాళి అర్పించారు. సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్, ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ పాండే, ఐఏఎఫ్ వైస్-చీఫ్ ఎయిర్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్, నేవీ చీఫ్ అడ్మిరల్ హరికుమార్ పాల్గొన్నారు. పాకిస్థాన్‌పై విజయం సాధించినందుకు గుర్తుగా ఏటా డిసెంబర్ 16న భారత్ విజయ్ దివస్ జరుపుకుంటుంది. ఇవాళ దేశ చరిత్రలో మరువరాని రోజు. 1971 యుద్ధంలో భారత్ పాకిస్థాన్‌పై విజయం సాధించింది. బంగ్లాదేశ్ ఆవిర్భావానికి దారితీసిన 1971 యుద్ధంలో భారతదేశం సాధించిన విజయానికి గుర్తుగా యేటా డిసెంబర్ 16న విజయ్ దివస్ జరుపుకుంటారు.

దిల్లీ మేయర్ ఫేస్‌బుక్ పేజీ హ్యాక్

న్యూఢిల్లీ: తన ఫేస్‌బుక్ పేజీ హ్యాక్ అయినట్లు దిల్లీ మేయర్ షెల్లీ ఒబెరాయ్ ప్రకటించారు. కొన్నిరోజులుగా సోషల్ మీడియాలో తన ఫేస్‌బుక్ పేజీ యాక్సెస్‌లో లేదని ఆమె తెలిపారు. వీలైనంత త్వరగా రికవరీ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని మేయర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. 'కొన్ని రోజుల నుంచి నా ఫేస్‌బుక్ పేజీ హ్యాక్ అయింది. మేము వీలైనంత త్వరగా దాన్ని పునరుద్ధరించడానికి ప్రయత్నిస్తున్నాము.

నా పేజీ ద్వారా ఏదైనా అసాధారణ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం పాస్ అయి ఉంటుందనే కారణంతోనే పేజీ హ్యాక్ అయిందని తెలుస్తుంది. దీని గురించి మీరు తెలుసుకోండి' అని ఆమె తన పోస్టులో పేర్కొన్నారు.

పార్లమెంటు భద్రతా ఉల్లంఘన వెనుక

నిరుద్యోగం... ధరల పెరుగుదల

- మోదీ విధానాల వల్ల యువతలో ఆగ్రహం
- కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : పార్లమెంటు భద్రతా ఉల్లంఘన వెనుక నిరుద్యోగం, ధరల పెరుగుదలే కారణమని కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ అన్నారు. శనివారం ఇక్కడ పార్టీ గుజరాత్ విభాగం నాయకులతో ఎన్నికల వ్యూహ సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ విధానాల వల్ల ఉద్యోగాలు రాని యువతే పార్లమెంటు భద్రతను ఉల్లంఘించారని తెలిపారు. ఈ ఉల్లంఘన యువతలో చాలా కాలంగా చెలరేగిన కోపానికి కారణమన్నారు. 'దేశంలోని అతిపెద్ద సమస్య నిరుద్యోగం అని, మోదీ విధానాల వల్ల దేశంలోని యువతకు ఉపాధి లభించడం లేదని విమర్శించారు. కాగా, రాహుల్ గాంధీ 'ఎక్స్'లో హిందీలో చేసిన పోస్ట్‌లో, 'ఉద్యోగాలు ఎక్కడ ఉన్నాయి? యువకులు నిరాశలో ఉన్నారు. మీరు ఈ అంశంపై దృష్టి పెట్టాలి. యువతకు ఉద్యోగాలు ఇవ్వాలి' అని పేర్కొన్నారు. 'కచ్చితంగా భద్రతా లోపం ఉంది. కానీ దాని వెనుక కారణం దేశంలోని అతిపెద్ద సమస్య నిరుద్యోగం' అని గాంధీ అన్నారు. దీనికి బీజేపీ స్పందిస్తూ, గాంధీ 'ఎల్లప్పుడూ చెత్త గురించి మాట్లాడుతుంటాడు' అని బీజేపీ అవహేళన చేసింది. నిరుద్యోగం గత ఆరేళ్లలో కనిష్ఠ స్థాయికి చేరుకుందని తెలిపింది. 'బదులుగా రాహుల్ గాంధీ, 'ఇండియా' కూటమి నాయకులు కాంగ్రెస్, టీఎంసీ, సీపీఎం పార్లమెంటు ఉల్లంఘనకు పాల్పడిన వారి సన్నిహిత సంబంధాలను వివరించాలి. రాహుల్ గాంధీ,

ముఖ్యంగా భారత్ జోడో యాత్రలో పాల్గొన్న అసిమ్ సరోదేతో తన అనుబంధాన్ని స్పష్టం చేయాలి. అక్రమార్కులకు న్యాయ సహాయాన్ని అందజేస్తానని ఆఫర్ ఇచ్చింది' అని ఆరోపిస్తూ బీజేపీ ఐటీ ఇన్‌ఛార్జ్ అమిత్ మాల్వియా సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. మరొక పోస్ట్‌లో, 'రాజవంశం కోసం దానం చేయకండి' అనే శీర్షికతో కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ సాహు అవినీతిని ప్రత్యేకంగా ప్రస్తావించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ పార్లమెంటు భద్రతా ఉల్లంఘన తీవ్రమైన సమస్య అని, అయినప్పటికీ కేంద్ర హోం మంత్రి దానిపై ప్రకటన ఇవ్వడానికి సిద్ధంగా లేరని విమర్శించారు. భద్రతా ఉల్లంఘన తీవ్రమైన అంశం, ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టాలి. పార్లమెంటులో హోం మంత్రి ప్రకటన కోసం అడుగుతున్నాం, కానీ ఆయన ప్రకటన ఇవ్వడం లేదు. టీవీ షోలలో మాట్లాడుతున్నారు. కానీ పార్లమెంటు లోపల కాదు' అని అన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని, అయితే ప్రజాస్వామ్యంపై నమ్మకం లేని వారికి ఇందులో అర్థం లేదని ఖర్గే అన్నారు. ఇదిలాఉండగా, పార్లమెంటు భద్రతా ఉల్లంఘన అంశాన్ని కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేస్తోందని అమిత్ షా నిందించడంపై ప్రశ్నించగా, ఖర్గే స్పందిస్తూ, 'హోం మంత్రి అమిత్ షా ఓట్లు అడగడానికి మా గురించి మాట్లాడతారు. ఓట్లు అడగడానికి నెహ్రూ జీని దుర్భాషలాడారు. వారు చేసేది ఇదే' అని అన్నారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ మాట్లాడుతూ ఈ ఘటనతో రాజకీయ మైలేజీ పొందేందుకు ప్రయత్నిస్తున్నది కాంగ్రెస్ కాదని, బీజేపీ అని అన్నారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అధీనంలోని దిల్లీ పోలీసులు దీనిని కోర్టులో 'ఉగ్ర దాడి'గా అభివర్ణించారని, ప్రతిపక్షాలు పార్లమెంటులో చర్చకు మాత్రమే ప్రయత్నిస్తున్నాయని ఆయన అన్నారు. నిందితులకు పార్లమెంటులో ప్రవేశం కల్పించిన ఎంపీని కూడా ప్రశ్నించలేదని, ప్రభుత్వం నుంచి సమాధానాలు కోరిన వారిని సస్పెండ్ చేశారని వేణుగోపాల్ అన్నారు. 'పార్లమెంటు శాంతిభద్రతల అంశాన్ని ప్రతిపక్షాలు రాజకీయం చేయడం లేదు. కానీ బీజేపీ, హోం మంత్రి, ప్రధాన మంత్రి రాజకీయం చేస్తున్నారు. ఈ అంశం పార్లమెంటు పరిధిలోకి, స్పీకర్ పరిధిలోకి వస్తుందని హోం మంత్రి మాకు చెబుతున్నారు' అని తెలిపారు. 'దిల్లీ పోలీసు విభాగం దేశ హోం మంత్రి ఆధ్వర్యంలో ఉంది. కాదా? దిల్లీ పోలీసులు ఇది ఉగ్ర దాడి అని కోర్టులో అఫిడవిట్ ఇచ్చారు. మేము దానిని రాజకీయం చేయలేదు. మేము దానిని ఉగ్రవాద దాడిగా పేర్కొనలేదు. ఇది ప్రభుత్వ పక్షం నుంచి తీవ్రమైన భద్రతా లోపం' అని వేణుగోపాల్ అన్నారు. కొత్త పార్లమెంటు భవనం 'అత్యంత సురక్షితమైన ప్రదేశాలలో' ఒకటిగా ఉంటుందని బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పేర్కొనడంపై, ఎంపీల సస్పెన్షన్‌పై ఆయన విమర్శలు గుప్పించారు. 'ఒకవైపు పార్లమెంటు సభ్యులందరిపైనా, గొంతు పెంచుతున్న వారిపైనా శిక్షలు వేస్తున్నారు. 15 మంది ఎంపీలను సస్పెండ్ చేశారు. ఏ కారణం చేత 15 మంది ఎంపీలను సస్పెండ్ చేశారు? ఈ పార్లమెంటులో సభ్యులను సస్పెండ్ చేయడం ప్రిసైడింగ్ అధికారి ప్రధాన పాత్రగా మారింది. 'దేశం గురించి మాట్లాడే వారు పార్లమెంటు భవనాన్ని కూడా రక్షించలేరని ప్రజలు భావించవచ్చు. దీని గురించి ప్రజలు ఆందోళన చెందుతున్నారు' అని వేణుగోపాల్ అన్నారు.

మహిళల భద్రతకు భరోసా కరువు

'నిర్భయ'కు 11 ఏళ్లు

న్యూఢిల్లీ: నిర్భయ కేసుకు శనివారంతో 16 ఏళ్లు నిండాయి. పారామెడికల్ విద్యార్థినిని కొంతమంది మృగాళ్లు దేశరాజధాని దిల్లీలో 2012 డిసెంబరు 16న అతి పాశవికంగా అత్యాచారం చేసి...తీవ్రంగా గాయపరిచారు. రాత్రివేళ ఓ ప్రైవేట్ బస్సులో చోటుచేసుకున్న ఈ దారుణ అత్యాచార ఘటన భారతదేశాన్నే కాకుండా యావత్ ప్రపంచాన్నీ కుదిపేసింది. నాడు అత్యంత క్రూరంగా జరిగిన అత్యాచార ఘటన దేశంలోని ప్రతీఒక్కరినీ కంటతడి పెట్టించింది. డిసెంబరు నాటి వణికించే చలిలో పారామెడికల్ విద్యార్థిని నిర్భయ కామాంధుల చేతుల్లో చిగురుటాకులా వణికిపోయింది. బాధితురాలికి న్యాయం చేయాలంటూ దేశంలోని ప్రజలంతా రోడ్లపైకి వచ్చి ఆందోళనలకు దిగారు. ఈ దారుణ అత్యాచారం తరువాత దేశంలో మహిళల రక్షణ విషయంలో చాలామార్పులు వచ్చాయి. దేశవ్యాప్తంగా మహిళల భద్రత కోసం అనేక చర్యలు చేపట్టారు. నిర్భయ అత్యాచార ఘటన దర్యాప్తు అనంతరం జస్టిస్ జేఎస్ వర్మ కమిటీ సిఫార్సులు అమలయ్యాయి. దేశంలో

ప్రతీ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అత్యాచార బాధితుల కోసం వన్ స్టాప్ సెంటర్లు, హెల్ప్‌లైన్లు ప్రారంభించారు. నిర్భయ ఫండ్ విడుదల చేశారు. నిర్భయ స్క్వాడ్, నిర్భయ యాప్ అందుబాటులోకి వచ్చింది. ఎనిమిదేళ్ల పాటు నిర్భయ కేసు విచారణ కొనసాగగా దోషులైన ముఖేశ్, పవన్, అక్షయ్, వినయ్‌లను 2020 మార్చిలో దిల్లీలోని తీహార్ జైలులో ఉరితీశారు. ఒక మైనర్‌కు విముక్తి లభించింది. మరో నిందితుడు రామ్ సింగ్ విచారణ సమయంలో జైలులో ఆత్మహత్య చేసుకున్నాడు. నిర్భయ ఘటన, కేసు దర్యాప్తు, దోషులకు శిక్ష అమలు తర్వాత దేశంలో అత్యాచార ఘటనలు తగ్గుముఖం పడతాయని అందరూ భావించారు. అయితే దీనికి భిన్నమైన పరిస్థితులు దేశంలో తాండవిస్తున్నాయి. ప్రముఖ జాతీయ ఏజెన్సీ ఎన్‌సీఆర్‌బీ నిర్భయ ఘటన అనంతరం గత 11 ఏళ్లలో దేశంలో చోటుచేసుకున్న అత్యాచార గణాంకాల వివరాలను విడుదల చేసింది. ఇవి మరింత ఆందోళన కలిగించేలా ఉన్నాయి నిర్భయ లాంటి హృదయ విదారక అత్యాచార ఘటనల తర్వాత కూడా దేశంలో మహిళల భద్రత విషయంలో ఆశించినంత మార్పు రాలేదు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో ఇటీవల విడుదల చేసిన 2022 సంవత్సరానికి సంబంధించిన నివేదిక ప్రకారం... గతేడాది దేశంలో మొత్తం 31,516 అత్యాచార కేసులు నమోదయ్యాయి. అంటే ప్రతిరోజూ దాదాపు 87 మంది, ప్రతి గంటకు మూడు నుంచి నలుగురు బాలికలు లేదా మహిళలు అత్యాచారానికి గురవుతున్నారు. ఈ నివేదిక ప్రకారం అత్యాచార ఘటనల విషయంలో రాజస్థాన్ మొదటి స్థానంలో ఉంది. గతేడాది అత్యధికంగా 5,399 అత్యాచార కేసులు ఇక్కడ నమోదయ్యాయి. దిల్లీలో 1212 అత్యాచార కేసులు నమోదయ్యాయి.

చొరబాటుకు ఉగ్రవాదులు సిద్ధం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో అంతర్జాతీయ సరిహద్దును దాటుకుని దేశంలోకి చొరబడేందుకు ఉగ్రమూకలు చేసే ప్రయత్నాలను భారత సైన్యం ఎప్పటికప్పుడు తిప్పికొడుతోంది. అయినప్పటికీ దాదాపు 300 మంది ఉగ్రవాదులు భారత్‌లోకి చొరబడేందుకు సరిహద్దు వెంబడి వేచి చూస్తున్నారని సరిహద్దు భద్రతా దళం ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. ముష్కరులను అడ్డుకునేందుకు భద్రతా బలగాలు అప్రమత్తంగా ఉన్నాయని తెలిపారు. దక్షిణ కశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో బీఎస్‌ఎఫ్ ఐజీ అశోక్ యాదవ్ శనివారం మీడియాతో మాట్లాడారు. భారత్‌లోకి అక్రమంగా చొరబడేందుకు సరిహద్దు వెంబడి 250-300 మంది ఉగ్రవాదులు వేచి ఉన్నట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం అందిందన్నారు. అయితే, జమ్మూకశ్మీర్‌లో బీఎస్‌ఎఫ్, సైన్యం అప్రమత్తంగా ఉన్నాయని, ఉగ్రవాదుల చొరబాటు యత్నాన్ని తాము సమర్థవంతంగా భగ్నం చేస్తామని ఆయన వెల్లడించారు. కొన్నేళ్లుగా కశ్మీరీ ప్రజలు, భద్రతా దళాల మధ్య అనుబంధం పెరిగిందని ఐజీ తెలిపారు. ఇలాగే ప్రజలు సహకరిస్తే ఈ ప్రాంతంలో అభివృద్ధి పనులు మరింత వేగంగా పూర్తి చేయగలుగుతామన్నారు. జమ్మూకశ్మీర్‌లో ఇటీవల కాలంలో ఉగ్రవాదుల చొరబాటు ఘటనలు తగ్గుముఖం పట్టినప్పటికీ... అడపాదడపా పర్వత ప్రాంతాలు, అడవుల గుండా ముష్కరులు సరిహద్దు దాటేందుకు యత్నిస్తూనే ఉన్నారు.

'ఇండియా' కూటమిపై ప్రభావం ఉండదు

- హిందీ రాష్ట్రాల్లో ఎన్నికల ఫలితాలపై సీఎం స్టాలిన్ వ్యాఖ్య
- బీజేపీ వ్యతిరేక ఓట్లను ఏకీకృతం చేయాల్సి ఉందని స్పష్టీకరణ

చెన్నై : మూడు హిందీ మాట్లాడే రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ప్రతిపక్షాల నేతృత్వంలోని ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇన్‌క్లూజివ్ అలయెన్స్ (ఇండియా) కు గుణపాఠం చెప్పాయని, అయితే వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలపై ఎలాంటి ప్రభావం ఉండదని ద్రవిడ మున్నేట్ర కజగం (డీఎంకే) అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ అన్నారు. ఒక ఆంగ్ల వార్తా పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇటీవలి మిచౌంగ్ తుపాను, చెన్నై, చుట్టుపక్కల వరద విపత్తు పరిస్థితులను తన ప్రభుత్వం నిర్వహించడం గురించి కూడా ఆయన మాట్లాడారు. అయితే సనాతన ధర్మ వివాదంపై ఒక ప్రశ్నను పక్కదారి పట్టించారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు లోక్‌సభ ఎన్నికలపై ప్రభావం చూపవని, ప్రత్యేకించి రాష్ట్రానికి సంబంధించిన సమస్యలపై అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని అన్నారు. రాజస్థాన్‌లో బీజేపీ గెలిచినా కాంగ్రెస్, బీజేపీల మధ్య ఓట్ల తేడా కేవలం 10 లక్షలేనని చెప్పారు. చత్తీస్‌గఢ్‌లో బీజేపీ ఆరు లక్షల ఓట్లు అధికంగా సాధించిందని, మధ్య ప్రదేశ్‌లో మాత్రమే బీజేపీకి 35 లక్షల ఓట్లు ఎక్కువ వచ్చాయన్నారు. బీజేపీ వ్యతిరేక ఓట్లను ఛేదించి ఉంటే, ఈ మూడు రాష్ట్రాల్లో ఆ పార్టీ విజయం సాధించలేకపోయేదని స్పష్టమవుతోందని తెలిపారు. 'ఇండియా' కూటమి అన్ని రాష్ట్రాలలో బీజేపీ వ్యతిరేక ఓట్లను ఏకీకృతం చేస్తుందని, పార్లమెంటు ఎన్నికల్లో సునాయాసంగా గెలుస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్ర గవర్నర్‌తో పాలనాపరమైన అంశాలపై నెలకొన్న ప్రతిష్టంభనకు తెరపడేందుకు సుప్రీం కోర్టు చేసిన సూచనల మేరకు గవర్నర్ మిమ్మల్ని సమావేశానికి ఆహ్వానించారా అని ప్రశ్నించినప్పుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ స్పందిస్తూ,

'నేను చాలాసార్లు గవర్నర్‌ను కలిశాను. ప్రభుత్వ కార్యక్రమాల్లో కలిసి పాల్గొన్నాం. ఆయన నాతో ఇష్టపూర్వకంగా మాట్లాడాడు. సమస్య సమావేశం కాదు. గవర్నర్ మనసు మార్చుకుని తమిళనాడు సంక్షేమానికి కృషి చేయాలి. ప్రజలకు, ఆలోచనలకు, అభివృద్ధికి వ్యతిరేకమైన శక్తుల చేతుల్లో కీలుబొమ్మగా ఉండకుండా, రాష్ట్రాభివృద్ధికి తోడ్పాటు అందించాలి' అని అన్నారు. చెన్నై వరద పరిస్థితి గురించి ప్రభుత్వంపై విమర్శలు రావడంపై మాట్లాడుతూ తాము ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు రిజర్వాయర్ల నుంచి నీటిని చాలా ముందుగానే విడుదల చేయడం వల్ల పెద్ద ఎత్తున నష్టాన్ని నివారించగలిగామని కేంద్ర బృందం ప్రశంసించిందన్నారు. రెండు రోజులు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసిందని, వర్షాలు ఆగిన వెంటనే సహాయక చర్యలు చేపట్టామన్నారు. చాలా శివారు ప్రాంతాలలో పరిస్థితి సాధారణ స్థితికి చేరుకుందన్నారు. తాను వ్యక్తిగతంగా అనేక ప్రాంతాలను సందర్శించానని, 20 మంది మంత్రులు, 50 మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, 20 వేల మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులు రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారని వివరించారు. డీఎంకే పార్లమెంటరీ పార్టీ నేత టి.ఆర్.బాలు వరద సహాయాన్ని కోరుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి లేఖ సమర్పించారని తెలిపారు. వాతావరణ మార్పు మిషన్‌ను ప్రారంభించడంతో పాటు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిన ఏకైక రాష్ట్రం తమిళనాడు అని, మరే రాష్ట్రం ఈ సమస్యపై ఇంత శ్రద్ధ చూపలేదన్నారు. జనాభా సాంద్రత, వర్షం, తుపానులు, మురికినీటి వ్యవస్థ సామర్థ్యం, డెల్టాలు, సముద్ర మట్టం, వాతావరణ మార్పు వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని మనం పథకాలను రూపొందించాలని ఆయన అన్నారు. వాతావరణ మార్పు అతిపెద్ద సవాలుగా మారుతుందని తాను చాలా సందర్భాలలో పునరుద్ఘాటించినట్లు సీఎం చెప్పారు. గత ఏఐఏడీఎంకే ప్రభుత్వం 2011 నుంచి 2021 మధ్య కాలంలో ఏ ప్రాజెక్టును సక్రమంగా అమలు చేయలేదని, దానికి తాము మూల్యం చెల్లిస్తున్నామన్నారు. కొత్త పథకాలు, ప్రాజెక్టులను అభివృద్ధి చేయడం ద్వారా, జనాభా పెరుగుదల, చెన్నై నగర విస్తరణకు అనుగుణంగా తాము వేగవంతం చేస్తామని అన్నారు.

రాజ్యసభలో ఆప్ పక్ష నేతగా రాఘవ్ చద్దా

న్యూఢిల్లీ : సంజయ్ సింగ్ స్థానంలో ఆమ్ ఆద్మీ పార్టీ తన ఎంపీ రాఘవ్ చద్దాను రాజ్యసభ నాయకుడిగా నియమించినట్లు ఆ వర్గాలు తెలిపాయి. 'ఆరోగ్య సమస్యలు' ఉన్న సంజయ్ సింగ్ గైర్హాజరీలో రాఘవ్ చద్దా ఇక నుంచి పెద్దల సభలో పార్టీ నాయకుడిగా ఉంటారని ఆప్ పార్టీ నాయకత్వం రాజ్యసభ చైర్మన్‌కు రాసిన లేఖలో పేర్కొంది. దిల్లీ మద్యం పాలసీ కేసులో ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ ప్రస్తుతం జైలులో ఉన్నారు. చద్దాను ఫ్లోర్ లీడర్‌గా నియమిస్తూ ఆప్ నుంచి లేఖ అందినట్లు రాజ్యసభ సచివాలయ వర్గాలు ధ్రువీకరించాయి. ఇది అమలు కోసం రాజ్యసభ ప్రధాన కార్యదర్శి వద్ద ఉంది. రాజ్యసభకు చెందిన అతి పిన్న వయస్కుల్లో చద్దా ఒకరు. ప్రస్తుతం ఎగువ సభలో ఆప్‌కు మొత్తం 10 మంది ఎంపీలు ఉన్నారు. రాజ్యసభలో బీజేపీ, కాంగ్రెస్, టీఎంసీల తర్వాత ఆప్‌కి నాలుగో అతిపెద్ద బలం ఉంది.

పట్టు వీడని అంగన్‌వాడీలు

- సమస్యలు పరిష్కరించాల్సిందేనని డిమాండ్
- ఐదవ రోజు కొనసాగిన సమ్మె

విశాలాంధ్ర -విజయవాడ: ప్రభుత్వం బెదిరించినా...మంత్రులు, ఎమ్మెల్యేలు అవమానాలు, అవహేళన చేసినా...అంగన్వాడీ కార్యకర్తలు మాత్రం పట్టువిడవకుండా సమ్మె కొనసాగిస్తున్నారు. అంగన్వాడీల రాష్ట్రవ్యాప్తం సమ్మె శనివారానికి ఐదో రోజుకు చేరింది. వేతనాలకు సంబంధించి ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీ అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఏడాదిగా అనేక రూపాల్లో ఉద్యమాలు చేసినా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించటంతో గత్యంతరం లేని పరిస్థితిల్లో ఈ నెల 12వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మెకు దిగారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ), ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ), ఏపీ ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) జేఏసీ అధ్వర్యంలో జరుగుతున్న అంగన్‌వాడీల ఉద్యమానికి వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, కార్మిక సంఘాలు మద్దతు ప్రకటించాయి. అంగన్‌వాడీ సంఘాల నాయకులను ప్రభుత్వం చర్చలకు పిలిచి 'తాను పట్టిన కుందేలుకు మూడు కాళ్లు..'అన్న చందంగా ప్రభుత్వం వ్యవహరించటంతో చర్చలు ఏమాత్రం ముందుకు సాగటం లేదు. నాయకులను రోజూ మంగళగిరి పిలిచి గంటల తరబడి కూర్చోబెడితే ఉద్యమంలో ఉన్న కిందస్థాయి నాయకులకు, అంగన్‌వాడీలకు ఎలాంటి సమాచారం లేకుండా చేయటం...ఉద్యమాన్ని తీవ్రతరం చేసేలా నాయకులకు అవకాశం కల్పించకుండా చూడటం..మహిళలు చేస్తున్న ఉద్యమాన్ని రోజుల తరబడి కొనసాగనిస్తే వెనక్కు తగ్గుతారనే ఆలోచనతో ప్రభుత్వం వ్యవహరిస్తుందని నాయకులు భావిస్తున్నారు. సమ్మె కారణంగా అంగన్‌వాడీ వర్కర్లు అంగన్‌వాడీ కేంద్రాలకు వేసిన తాళాలను ప్రభుత్వం పగులగొట్టి వేరే తాళాలు వేయిస్తుంది. శని, ఆదివారాలు అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. దీంతో ఎలాంటి పురోగతి లేకుండా సమ్మె కొనసాగుతుంది. ఈ సందర్భంగా ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలితమ్మ మాట్లాడుతూ తాము కొత్తగా ప్రభుత్వాన్ని అదనంగా ఏమీ డిమాండ్ చేయటం లేదన్నారు. ఎన్నికల సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయమని కోరుతున్నామని చెప్పారు. కనీస వేతనం రూ.26 వేలు, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలని, వేతనంలో సగం పింఛన్‌గా ఇవ్వాలని అడుగుతున్నామని తెలిపారు. ప్రభుత్వ నుంచి ఎలాంటి సానుకూల సమాధానం రావటం లేదన్నారు. ప్రభుత్వం దిగి వచ్చి తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. ఈ మేరకు మరో ఐదు రోజులకు ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు.

అంగన్‌వాడీల ఉద్యమం కార్యాచరణ

17వ తేదీన అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించటం, 18న ఆర్డీఓ కార్యాలయాల వద్ద ప్రదర్శనలు, 19వ తేదీన వంటా-వార్పు, 20న భిక్షాటన, 21న రిలే దీక్షలు చేయనున్నట్లు జేఏసీ నాయకులు వెల్లడించారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే అందరితో చర్చించి ఉద్యమాన్ని తీవ్రతరం చేసేందుకు కార్యాచరణ ప్రకటిస్తామని వివరించారు.

పుస్తక పఠనం ప్రాముఖ్యతపై విస్తృత ప్రచారం జరగాలి

ప్రముఖ డాక్టర్ కూటికుప్పల

విశాలాంధ్ర -విశాఖ: ప్రస్తుత కంప్యూటర్ యుగంలో పుస్తక పఠనంపై నిర్లక్ష్యం ఉందని, ఇది పోవాలంటే పుస్తక పఠనం ప్రాధాన్యతను నేటితరానికి తెలియజెప్పాలని ప్రముఖ డాక్టర్ కూటికుప్పల సూర్యారావు అన్నారు. అరసం విశాఖ జిల్లా సమితి అధ్వర్యంలో విశాలాంధ్ర విశాఖ 22వ పుస్తక మహోత్సవ ప్రాంగణంలో శనివారం జరిగిన కవి సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. కవులంతా సామాజిక స్పృహతో మెలిగి వాస్తవ పరిస్థితులను ప్రజానీకానికి తెలియజేసేందుకు ముందుకు రావాలన్నారు. పలస్తీనాపై దాడులను కవితగా చెప్పాలని కోరారు. కవులు ఎస్ హనుమంతరావు, శేఖరమంత్రి, ఆదిరెడ్డి మావుళు ,, పి శ్యాంసుందర్, రత్నరాజు, ఫ్రాన్సిస్, దేవ్వుల పద్మజ, బి పావని, డి విశాలాక్షి తదితరులు పలస్తీనా పై ఇజ్రాయిల్ దమనకాండను ఖండిస్తూ కవితలు చదివారు. అనంతరం కవులందరినీ కూటికుప్పల ఘనంగా సన్మానించారు. సభకు అరసం జిల్లా కార్యదర్శి ఉప్పల అప్పలరాజు అధ్యక్షత వహించగా బండి సత్యనారాయణ సారధ్యం వహించారు.

వైద్య రంగంలో కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రనాథ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్ర ప్రదేశ్ వైద్య విధాన పరిషత్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు. ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వి.బాలయ్య అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రవీంద్రనాథ్ మాట్లాడుతూ వైద్య విభాగంలో ఒకే సెలక్షన్ కమిటీ ద్వారా నియామకం పొందిన ఉద్యోగులు ఏపీవీవీపీ విభాగంలో 20 సంవత్సరాలుగా పని చేస్తున్నారని, అయినా వారిని ఇప్పటివరకు రెగ్యులర్ చేయకపోవడం దారుణమన్నారు. ఒకే సెలక్షన్ కమిటీ ద్వారా నియామకం పొందిన వారిని రెగ్యులర్ చేయడం, అదే సెలక్షన్ కమిటీ ద్వారా పని చేసే ఉద్యోగులను రెగ్యులర్ చేయకపోవడం శోచనీయమన్నారు. వైద్య విభాగంలో పని చేసే కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రెగ్యులరైజ్ చేయాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను, స్కీం వర్కర్లుగా పని చేసే ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ ఉద్యోగులకు పీఆర్సీ కాల పరిమితి పూర్తయినందువల్ల ఇంటీరియర్ రిలీఫ్ 27 శాతం చెల్లించాలని కోరారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.గిరిబాబు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్స్, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్ ఎన్‌క్యాష్‌మెంట్, వైద్య రంగంలో ఖాళీగా ఉన్న పదోన్నతి పోస్టులను భర్తీ చేయాలని, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్ వన్ పోస్టులు, చీఫ్ రేడియో గ్రాఫర్ పోస్టులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడుఎం.బాలరాజు నాయుడు, రాష్ట్ర కోశాధికారి సాయి సత్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అప్పారావు, స్వామి బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.అప్పారావు, బి.సరోజ తదితరులు పాల్గొన్నారు.

టెకీలు జర జాగ్రత్త!

బెంగళూరు: టెకీల దూకుడుకు అడ్డుకట్ట వేసేందుకే బెంగళూరు పోలీసులు వినూత్న నిర్ణయం తీసుకున్నారు. ట్రాఫిక్ రూల్స్‌ను ఉల్లంఘిస్తే సమాచారం నేరుగా కంపెనీకి చేరుతుందని హెచ్చరించారు. సిగ్నల్ జంప్ చేయడం, స్పీడ్ లిమిట్‌ను దాటేసి దూసుకెళితే ఇకపై సహించేది లేదన్నారు. విషయాన్ని నేరుగా ఉద్యోగి పనిచేసే కంపెనీకే తెలియజేస్తామని స్పష్టంచేశారు. రహదారి భద్రతపై అవగాహన కల్పించడంలో భాగంగా ఐటీ కారిడార్, ఔటర్ రింగ్ రోడ్డు, వైట్ ఫీల్డ్‌లో పైలట్ ప్రాజెక్ట్‌గా బెంగళూరు ఈస్ట్ డివిజన్ ట్రాఫిక్ పోలీసులు దీనిని చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్ట్ సత్ఫలితాలను ఇస్తే బెంగళూరులోని మిగిలిన ప్రాంతాలకూ విస్తరిస్తామని బెంగళూరు ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. ఈస్ట్ బెంగళూరులో ఉండే టెకీలు త్వరగా గమ్యస్థానాలకు చేరుకోవడం కోసం ట్రాఫిక్ సిగ్నల్స్‌ను జంప్ చేస్తున్నారని బెంగళూరు ఈస్ట్ డివిజన్ డిప్యూటీ కమిషనర్ కుల్దీప్ కుమార్ జైన్ తెలిపారు. ఇకపై నిబంధనలు ఉల్లంఘించి పట్టుబడితే ఐడీకార్డు ఆధారంగా సమాచారాన్ని ఆ కంపెనీకి ఈమెయిల్, వాట్సప్ ద్వారా పంపుతామన్నారు. కంపెనీలు సైతం రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

'ప్రైవేట్'తో ఇస్రోకు వేల కోట్లు: జితేంద్రసింగ్

న్యూఢిల్లీ: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) అంతరిక్ష రంగంలో బలమైన శక్తిగా ఎదుగుతోంది. వివిధ రకాల వాహక నౌకలను రూపొందించి అద్భుతాలు సృష్టిస్తోంది. ఉపగ్రహ సేవలు, వాణిజ్యపరంగా ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టడంలో రికార్డులు నెలకొల్పుతోంది. అంతరిక్ష వాణిజ్యంలో ఇతర దేశాలు, ప్రైవేటు సంస్థలతో పోటీపడుతూ వరుస విజయాలు నమోదు చేస్తోంది. గడచిన 4-5 ఏళ్లకాలంలో భారత అంతరిక్ష పరిశోధన రంగంలో అద్భుత మార్పులు చోటుచేసుకున్నాయి. ఇస్రో ఎలా డబ్బు సంపాదిస్తుందో కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖమంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు. భారత శాస్త్రవేత్తలు ప్రతిభ, సామర్థ్యం, ఫ్యాషన్‌తో పనిచేస్తున్నారని జితేంద్రసింగ్ అన్నారు. గతంలో వారికి సరైన ప్రోత్సాహం లేకపోవడం వల్ల పురోగతి కుంటుపడిందన్నారు. మోదీ రాకతో ప్రైవేట్ మార్గాల నుంచి పెట్టుబడులు పెరుగుతున్నాయని చెప్పారు. అమెరికా, రష్యా వంటి ఇతర దేశాలకు ఉపగ్రహాలను ప్రయోగించడం ద్వారా వచ్చే ఆదాయం గురించి మాట్లాడారు. నాసాకు సగం వనరులు ప్రైవేట్ పెట్టుబడుల నుంచి వస్తున్నాయని తెలిపారు.



కేరళలో కరోనా కొత్త వేరియంట్ కలకలం

తిరువనంతపురం: కేరళలో కరోనా కొత్త వేరియంట్ కలకలం రేపుతున్నది. జేఎన్.1 వేరియంట్ కేసులు పెరుగుతున్నాయి. దేశంలో మొత్తం రోజువారీ కేసుల్లో కేరళలోనే అత్యధికంగా నమోదవుతున్నాయి. నవంబర్ నెల మొత్తం 470 కేసులు కేరళలో నమోదు కాగా డిసెంబర్ నెల తొలి పది రోజుల్లోనే 825 మంది కరోనా బారినపడ్డారు. రాష్ట్రంలో యాక్టివ్ కేసుల సంఖ్య 1104కు పెరిగింది. కొత్త వేరియంట్ కేసులు పెరగడం దేశంలో కొత్త కరోనా కేసుల సంఖ్య పెరగడానికి కారణం అవుతున్నది. గడిచిన 24 గంటల్లో దేశంలో 312 కరోనా కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది మే 31 తర్వాత దేశంలో ఇంత భారీ సంఖ్యలో కేసులు నమోదవడం ఇదే తొలిసారి. 24 గంటల్లో 17,605 మందికి పరీక్షలు నిర్వహించగా 312 మందికి పాజిటివ్‌గా తేలింది. మొత్తం యాక్టివ్ కేసుల సంఖ్య 1296కు చేరింది. ఇప్పటివరకు నమోదైన కేసుల సంఖ్య నాలుగున్నర కోట్లు దాటింది. అందులో 98శాతం మంది కోలుకున్నారు. 5,33,310 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటివరకు 220.67 కోట్ల కరోనా టీకాల పంపిణీ జరిగింది.

అమరావతిని నాశనం చేసిన జగన్

నక్కా ఆనంద్ బాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కుట్ర రాజకీయాలతో అమరావతి రాజధానిని సీఎం జగన్ నాశనం చేశారని టీడీపీ బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు విమర్శించారు. రాష్ట్ర రాజధాని ఏది అనే ప్రశ్నకు సమాధానం లేకుండా చేసినందుకు జగన్ సిగ్గుపడాలన్నారు. మంగళగిరి టీడీపీ జాతీయ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. నాలుగున్నరేళ్లుగా జగన్ దుర్మార్గాలు, కుతంత్రాలను ఎదిరించి పోరాడుతున్న రాజధాని ప్రాంత రైతులు, ప్రజాసంఘాలు, మహిళలకు ఉద్యమాభివందనలు తెలిపారు. రాజధాని రైతులకు కౌలు చెల్లించలేని జగన్, మూడు రాజధానులు ఎలా కడతాడని ప్రశ్నించారు. తుపాను వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వలేని సీఎం, పేదలకు ఇళ్లు కట్టిస్తారని మండిపడ్డారు. రైతులను జగన్ తన కక్ష సాధింపులతో వేధించారని, 1700కు పైగా కేసులు పెట్టారని దుయ్యబట్టారు. దళిత రైతులపై అట్రాసిటీ కేసులు పెట్టి సంకెళ్లతో రోడ్లపై తిప్పారని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అమరావతిని రాజధానిగా అంగీకరించి, అధికారంలోకి వచ్చాక మూడు రాజధానుల నాటకం ఆడారన్నారు. చంద్రబాబు హయాంలో నిర్మించిన భవనాల్లో ఉంటూ రైతులిచ్చిన భూముల్లో తిరుగుతూ, సిగ్గు లేకుండా రాజధాని ప్రాంతంలోని నిర్మాణ సామగ్రిని అమ్ముకునే దుస్థితికి జగన్ ప్రభుత్వం వచ్చిందన్నారు. ఈ దిక్కుమాలిన ప్రభుత్వం ఎప్పుడు పోతుందా?, తమకు ఎప్పుడు మంచి రోజులు వస్తాయా అని ప్రజలు ఎదురు చూస్తున్నారని చెప్పారు.

సహకరించండి... ఎంపీలకు స్పీకర్ లేఖ

న్యూఢిల్లీ: లోక్‌సభలో భద్రతా వైఫల్యంపై పార్లమెంట్ దద్దరిల్లుతోంది. సభా కార్యక్రమాలకు అంతరాయం కలుగుతోంది. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా సమాధానం కోసం విపక్షాలు పట్టుబట్టాయి. దీంతో ఎంపీలకు స్పీకర్ ఓం బిర్లా ఓ లేఖ రాశారు. ఉభయ సభల కార్యకలాపాలకు అంతరాయం కలగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. సభ సజావుగా సాగేందుకు సహకరించాలని కోరారు. పార్లమెంటు భద్రత కోసం తానే స్వయంగా ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేశానన్నారు. మొత్తం పార్లమెంటు సముదాయానికి సంబంధించిన అంశాలను కమిటీ సమీక్షిస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా కమిటీ పటిష్ట చర్యలు, ప్రణాళికలు సిద్ధం చేస్తుందని భరోసా ఇచ్చారు. పార్లమెంట్‌పై ఉగ్రదాడికి 22 ఏళ్లు అయిన రోజే మళ్లీ భద్రతా వైఫల్యం చోటు చేసుకుంది. దీనికి నిరసనగా ఆందోళనకు దిగిన ఎంపీలను సస్పెండ్ చేయడంతో విపక్షాల గొంతును నొక్కుతూ ప్రభుత్వం పారిపోతుందని ప్రతిపక్షాలు ఆరోపించాయి.

నా హామీ అక్కడే మొదలు...

వికసిత్ భారత్ యాత్రలో మోదీ

న్యూఢిల్లీ: అభివృద్ధి చెందిన దేశాల సరసన భారత్‌ను నిలపాలన్న సంకల్పంతో 'మోదీ హామీ వాహనం' ప్రతి మూలకు చేరుతుందని ప్రధాని మోదీ అన్నారు. తన సంకల్పంలో చిన్న నగరాల అభివృద్ధే కీలకమన్నారు. ప్రతి ఒక్కరి ఆశ ఎక్కడ ముగుస్తుందో అక్కడి నుంచే తన హామీ ప్రారంభమవుతుందని ప్రధాని అన్నారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలన్నదే ధ్యేయంగా చెప్పారు. 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర'లో భాగంగా కేంద్ర పథకాల లబ్ధిదారులనుద్దేశించి

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని మాట్లాడారు. సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ యాత్రను ప్రారంభించినట్లు చెప్పారు. రైతులు, పేదలు, చిరు వ్యాపారులు ఇలా సమాజంలోని ప్రతి ఒక్కరికీ వివిధ పథకాల రూపంలో కేంద్రం సాయం చేస్తోందన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన చాలా ఏళ్ల వరకు అభివృద్ధి ఫలాలు కేవలం పెద్ద నగరాలకు పరిమితమం కాగా తమ పాలనలో చిన్న పట్టణాల అభివృద్ధి, తద్వారా దేశ సర్వతోముఖాభివృద్ధికి పునాదులు పడినట్లు మోదీ గొప్పలుపోయారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వివిధ పథకాల లబ్ధిదారులతో ప్రధాని మోదీ సంభాషించారు.

నేడు పారిస్‌లో ఐఎఫ్‌జే ప్రదర్శన

పారిస్: గాజా స్ట్రిప్‌లో భీకర పోరునకు తక్షణమే ముగింపు పలకాలని ది ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్‌జే) పిలుపునిచ్చింది. ఇందుకోసం ఫ్రాన్స్‌లోని అనుబంధ కార్మిక సంఘాలతో కలిసి ఆదివారం పారిస్‌లోని ప్లేస్ డి లా రిపబ్లిక్‌లో ప్రదర్శనకు నడుం బిగించింది. ఈనెల 17న మధ్యాహ్నం 2 గంటలకు నిరసన ప్రదర్శనకు ఐఎఫ్‌జే పిలుపునిచ్చింది. గాజాలో కాల్పుల విరమణ, జర్నలిస్టుల రక్షణకు డిమాండ్ చేసింది. వెస్ట్‌బ్యాంక్‌తో పాటు లెబనాన్ సరిహద్దులోనూ జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని ఓ ప్రకటన చేసింది. పశ్చిమాసియాలో సమాచార హక్కుకు విఘాతం కలుగుతోందని, ఫ్రాన్స్, యూరప్‌లోనూ పరిస్థితి ఇదేనంటూ ఐఎఫ్‌జే ఆందోళన వ్యక్తంచేసింది.

సానుకూల అజెండాతో ముందుకు...

ఎన్నికల సన్నద్ధతపై గుజరాత్ నేతలతో కాంగ్రెస్ చర్చలు

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది జరగబోయే సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఏ విధంగా ముందుకెళ్లాలనే అంశంపై కాంగ్రెస్ పార్టీ వరుస సమావేశాలు నిర్వహిస్తోంది. ఎన్నికలకు వెళ్లే క్రమంలో ఎదురయ్యే సవాళ్లు, పార్టీని ప్రతి రాష్ట్రంలో బలపర్చుకోవడం, బీజేపీ అవినీతి పాలన గురించి ప్రజలకు అవగాహన కల్పించడం వంటి అంశాలపై సమాలోచనలు జరుపుతోంది. ఇదే క్రమంలో శనివారం ఏఐసీసీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన గుజరాత్‌లోని కాంగ్రెస్ నేతలతో అధిష్ఠానం సమావేశమైంది. సార్వత్రిక ఎన్నికలు, సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసుకోవడం, గుజరాత్ రాష్ట్ర పరిస్థితులపై రెండున్నర గంటలకుపైగా చర్చించింది. కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, సీనియర్లు ముకుల్ వాస్నిక్, పార్టీ గుజరాత్ అధ్యక్షుడు శక్తిసిన్హ గోహిల్ పాల్గొన్నారు. ఎన్నికల సన్నద్ధతపై చర్చలతో పాటు పార్టీని బలపర్చుకుంటూ సానుకూల అజెండాతో ముందుకు వెళదామని సమావేశంలో ఖర్గే అన్నారు. గుజరాత్‌లో కాంగ్రెస్‌కు ఎదురయ్యే సవాళ్లు, వాటి పరిష్కారాలు, బీజేపీ పాలనలో ప్రజల పరిస్థితి, సమస్యలు, 2024 సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధతపై సమగ్రంగా చర్చించారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఆర్థిక అసమానతలు, దళితులు, గిరిజనులపై దురాగతాలు, మోసాలు, అవినీతి వంటి అంశాలపై చర్చించినట్లు ఎక్స్ మాధ్యమంగా ఖర్గే తెలిపారు. సమావేశం అనంతరం గోహిల్ విలేకరులతో మాట్లాడుతూ ఈ సమావేశాన్ని నిర్వహించినందుకుగాను పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. గుజరాత్‌లో బీజేపీ అవినీతి రాజ్యం సాగుతోందని, పేదలను దోచుకుంటోందని చెప్పారు. అవినీతియే ప్రధాన అజెండాగా ముందుకెళతామని గోహిల్ అన్నారు. ఈ సమావేశం నిర్మాణాత్మకంగా జరిగిందని వాస్నిక్ తెలిపారు. సమావేశం రెండున్నర గంటలు సాగిందని చెప్పారు.

నా కొడుకు అమాయకుడు

పార్లమెంట్ దాడి సూత్రధారి తండ్రి

న్యూఢిల్లీ: తన కుమారుడు అమాయకుడని పార్లమెంట్‌లో భద్రతా ఉల్లంఘనకు పాల్పడిన కేసులో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న లలిత్ ఝా తండ్రి దేవానంద్ అన్నారు. ఈ వ్యవహారంలో అతని ప్రమేయం ఏమీ లేదని, అవసరమైతే తాము కోర్టును ఆశ్రయిస్తామని చెప్పారు. ఈ ఘటన గురించి తమకు గురువారమే తెలిసిందన్నారు. తన కొడుకు బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసి కళాశాలలో ప్రశంసలు అందుకున్నాడని, అతడొక బాధ్యతాయుతమైన పౌరుడని చెప్పుకొచ్చారు. లలిత్ ఎప్పుడూ తమ శ్రేయస్సు గురించే ఆందోళన చెందేవాడని చెప్పారు. తన కొడుకుపై వస్తున్న ఆరోపణలను దేవానంద్ ఖండించారు. తన కుమారుడు నేరస్థుడు కాదని, ఎలాంటివాడో గ్రామస్థులను అడిగి తెలుసుకోచ్చని తెలిపారు. అతడు ట్యూషన్లు చెప్తూ జీవనం సాగిస్తున్నాడన్నారు. తమని బీహార్‌లోని దర్భంగా పంపించి, డిసెంబర్ 10వ తేదీన వ్యక్తిగత పని మీద దిల్లీకి వెళ్తున్నట్టు లలిత్ చెప్పాడన్నారు. చివరగా అతనితో తాము మాట్లాడింది అదేనని, తమ కుమారుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్న సమాచారం ఇతరుల ద్వారా తెలిసిందని వెల్లడించారు. లలిత్ ఝా తల్లి సైతం తమ కుమారుడిపై వస్తున్న ఆరోపణలను తోసిపుచ్చారు. తన కుమారుడిని చాలా మంచి అబ్బాయిగా అభివర్ణించిన ఆమె... పార్లమెంట్ భద్రతా ఉల్లంఘన సంఘటన గురించి తమకు ఎలాంటి సమాచారం లేదన్నారు. మరోవైపు... కోల్‌కతాలో లలిత్ ఝా నిర్వహిస్తున్న కోచింగ్ సెంటర్ కూడా అతడు మంచివాడేనని తెలిపింది. ఈ ఘటనలో లలిత్ ఎలా చిక్కుకున్నాడో తమకు తెలియదని, అతడు సమస్యలకు దూరంగా ఉంటాడని లలిత్ సోదరుడు శంభు ఝా చెప్పుకొచ్చాడు.

రాహుల్ గాంధీకి ప్రజాప్రతినిధుల కోర్టు సమన్లు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ ఎంపీ, ఆ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీకి మరోసారి న్యాయస్థానం సమన్లు జారీ అయ్యాయి. ఉత్తర ప్రదేశ్ ప్రజా ప్రతినిధుల కోర్టు ఆయనకు శనివారం సమన్లు జారీ చేసింది. జనవరి 6న తమ ఎదుట హాజరు కావాలని సమన్లలో రాహుల్‌ను కోరింది. బీజేపీ అగ్ర నేత, కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై చేసిన వ్యాఖ్యలకుగాను రాహుల్ గాంధీపై కేసు నమోదయింది. షాపై రాహుల్ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారంటూ నాలుగేళ్ల కిందట (2018, ఆగస్టు 4న) బీజేపీ నేత విజయ్ మిశ్రా కేసు వేశారు. సుల్తాన్‌పూర్‌లోని ప్రజాప్రతినిధుల కోర్టులో ఈ కేసు విచారణ కొనసాగుతూ వచ్చింది. చివరకు నవంబరు 18న వాదనలు పూర్తి కాగా, జడ్జి యోగేష్ యాదవ్ తీర్పును రిజర్వు చేశారు. తర్వాత విచారణ నవంబరు 27న జరగ్గా.. రాహుల్ గాంధీని డిసెంబరు 16న తమ ఎదుట హాజరుకావాలని న్యాయస్థానం ఆదేశించింది. అయితే ఈ కేసులో విచారణ కోసం కోర్టుకు రాహుల్ గాంధీ రాలేదు. దీంతో జనవరి 6న కచ్చితంగా కోర్టుకు రావాల్సిందేనని సమన్లు జారీ అయ్యాయని విజయ్ మిశ్రా తరపు న్యాయవాది సంతోష్ పాండే వెల్లడించారు.

కమల్‌నాథ్‌ను తప్పించిన కాంగ్రెస్

భోపాల్: మధ్య ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి నుంచి సీనియర్ నేత, ఆ రాష్ట్ర మాజీ సీఎం కమల్‌నాథ్ (77) ను ఆ పార్టీ అధిష్టానం తప్పించింది. కొత్త అధ్యక్షుడిగా జీతూ పట్వారీ (50) పేరును ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శనివారం సాయంత్రం ప్రకటించారు. జీతూ నియామకం తక్షణం అమలులోకి వస్తుందని, కమల్‌నాథ్ ఇంతకాలం అందించిన సేవలు ప్రశంసనీయమని ఆయన తెలిపారు ఇటీవల మధ్య ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి పాలైన సంగతి తెలిసిందే. ఆ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ కమల్‌నాథ్ రాజీనామా చేస్తారని ఊహాగానాలు వినిపించాయి. కానీ అది జరగలేదు. ఇప్పుడు ఆయనను తప్పించి ఆ బాధ్యతలను మాజీ మంత్రి అయిన జీతూ పట్వారీకి అప్పగించారు. జీతూ పట్వారీ తాజా ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. గతంలో రెండుసార్లు ఎమ్మెల్యేగా నెగ్గారు. మధ్య ప్రదేశ్ కాంగ్రెస్‌లో కొత్త రక్తం ఎక్కించే క్రమంలోనే ఓడిపోయినా... జీతూనే పార్టీ అధ్యక్షుడిగా అధిష్ఠానం ఎన్నుకుంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.